వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక




హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 213 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | జనవరి 2025 | వెల : రూ 10/-




## నేటి నుంచే ఆ నాలుగు పథకాలకు శ్రీకారం

**గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా లబ్దిదారుల ఎంపిక**

- అర్హుల్లో ఒక్కరికి అన్యాయం జరగొద్దు..అనర్హులకు చోటు దక్కొద్దు
- పథకాల అమలుపై అధికారులు, మంత్రులతో సిఎం రేవంత్ సమీక్ష
- గ్రామానికో అధికారి చొప్పున పథకాల అమలుకు ఆదేశాలు

హైదరాబాద్,
గతంలో హామీ ఇచ్చిన విధంగా ఆదివారం నుంచి నాలుగు కొత్త పథకాలు ప్రారంభిస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పంపిణీ పథకాలను ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ -మిగతా 3 లో



## లక్ష్యం దిశగా దేశం పయనం

- ఈ గణతంత్రం మనకు ప్రత్యేకం
- విముక్తి ప్రదాతలను స్మరించుకునే సమయం
- జాతికిచ్చిన సందేశంలో రాష్ట్రపతి ముర్ము

న్యూఢిల్లీ,
ఈ గణతంత్ర దినోత్సవం మనకు మరింత ప్రత్యేకమైందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు అవుతోంది. దేశం మొత్తం గర్వించదగిన సందర్భం ఇది. మన లక్ష్యాల దిశగా నిజమైన ప్రయాణం సాగుతోందని ఆమె అన్నారు. గణతంత్ర దినోత్సవం -మిగతా 3 లో



## నేటి నుంచి రైతు భరోసా

- అసలుసిసలు రైతులకే పథకం
- ఆశగా చూస్తున్న జిల్లా రైతాంగం

నిజామాబాద్,
కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో భాగంగా ప్రకటించిన రైతుభరోసా పథకం సాయం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. నేటినుంచి పథకం మలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. రైతు భరోసాలో భాగంగా ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ తర్వాత మాట మార్చి -మిగతా 3 లో

## ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం



- రక్షణ, వాణిజ్య రంగాల్లో పరస్పరం మేలుకోసం యత్నం
- భారత్ , ఇండోనేసియా మధ్య పలు ఒప్పందాలు

న్యూఢిల్లీ,
ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని భారత్ , ఇండోనేసియా నిర్ణయించాయి. ముఖ్యంగా రక్షణ ఉత్పత్తుల తయారీ, వాణిజ్య రంగాల్లో పరస్పరం మేలు జరిగేలా ముందుకు వెళ్లేందుకు అంగీకరించాయి. -మిగతా 3 లో

## మోడీ ఫోటో పెట్టాల్సిందే

**ఇళ్లకు ఇందిరమ్మ పేరు పెడితే ఊరుకునేది లేదు**

- రేషన్ కార్డులపైనా ప్రధాని ఫోటో ఉండాల్సిందే
- లేకుంటే ఉచిత రేషన్ పంపిణీని ఆపేస్తాం
- కేంద్రమంత్రి బండి సంజయ్ హెచ్చరిక



కరీంనగర్,
ప్రధానమంత్రి ఆవాస్ యోజన పేరుతో కేంద్రం మంజూరు చేసిన ఇళ్లకు 'ఇందిరమ్మ' పేరు పెడతానంటే ఒక్క ఇల్లు కూడా మంజూరు చేసే ప్రసక్తే లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ తేల్చి చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులపై కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇందిరమ్మ పేరు పెడితే కేంద్ర ప్రభుత్వం ఒక్క ఇల్లు కూడా ఇవ్వదని ఆయన స్పష్టం చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పేరు పెడితేనే నిధులు ఇస్తామన్నారు. కాంగ్రెస్ ఫోటోలు పెడితే రేషన్ -మిగతా 3 లో



## రైతుల ఆత్మహత్యలపై స్పందనేదీ

- ఎంతమంది మరణించినా ఇంత నిర్లక్ష్యమా
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

హైదరాబాద్,
రాష్ట్రంలో అన్నదాతల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. శనివారం ఉదయం ఆదిలాబాద్ జిల్లాలోని బజార్‌హత్నూర్ మండలం వర్తమన్నూర్‌కు చెందిన మామిళ్ల నర్సయ్య పొలంలో ఉరేసుకున్నాడు. ఈ ఘటనపై మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందించారు. రైతు మామిళ్ళ -మిగతా 3 లో



## కేసీఆర్ సోదరి సకలమ్మ మృతి

**నివాళి అర్పించిన కేసీఆర్ తదితరులు**

హైదరాబాద్,
బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సోదరి చీటి సకలమ్మ (82) కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఆమె శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. శనివారం -మిగతా 3 లో

## సనాతన ధర్మం ఓ మహా వటవృక్షం



- దానిని చిన్నచిన్న పొదలతో పోల్చలేం
- యూపి సీఎం యోగి ఆదిత్యనాథ్

ప్రయాగ్‌రాజ్,
సనాతన ధర్మాన్ని వటవృక్షంగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అభివర్ణించారు. ఇతర పొదలతో దానిని పోల్చరాదని అన్నారు. ప్రయాగ్‌రాజ్ మహాకుంభ్‌లో విశ్వ హిందూ పరిషత్ ఏర్పాటు చేసిన సంత్ సమ్మేళన్‌లో ఆయన మాట్లాడుతూ, తీర్మానాలు -మిగతా 3 లో

## నిఘ నీడలో దేశ రాజధాని



- కట్టుదిట్టంగా పరేడ్ పరిసరాలు
- 15000 మంది పోలీసుల మోహరింపు.. 70 కంపెనీల పారామిలటరీ బలగాలు

న్యూఢిల్లీ,
గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా దేశ రాజధాని నిఘా నీడలో ఉన్నది. దేశ రాజధాని రిపబ్లిక్‌డే వేడుకలకు ముస్తాబవుతున్న తరుణంలో ఎలాంటి భద్రతా లోపాలూ తలెత్తకుండా ఉండేందుకు 70 కంపెనీలకు పైగా పారామిలటరీ బలగాలు, 15,000 మందికి -మిగతా 3 లో

# తాజ్‌మహల్ ప్రేమికులకు శుభవార్త

**ఎంట్రీ ఫీజు లేకుండానే ఉచిత ప్రవేశం**



**న్యూఢిల్లీ,ప్రజా స్వేచ్ఛ**
పేమ సౌధం తాజ్ మహల్‌ను వీక్షించాలనుకునే పర్యాటకులకు గుడ్‌న్యూస్. వరుసగా మూడురోజుల పాటు ఎలాంటి ఎంట్రీ ఫీజు చెల్లించకుండానే ఉచితంగానే ప్రవేశం కల్పించనున్నారు. మొఘల్ చక్రవర్తి షాజహాన్ 370వ ఉర్సు సందర్భంగా ఈ అవకాశం కల్పిస్తున్నారు. జనవరి 26 నుంచి 28 వరకు మూడురోజుల పాటు ఉర్సు జరుగనున్నది. ఈ సందర్భంగా పర్యాటకులకు ఉచితంగా తాజ్ మహల్ అందాలను వీక్షించే అవకాశం కల్పించారు. ఏటా షాజహాన్ వర్ధంతి సందర్భంగా ఉర్సు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ క్రమంలో మూడురోజుల పాటు పర్యాటకులు తాజ్ అందాలను చూసి అనుభూతి చెందే అవకాశం దక్కనున్నది. అదే సమయంలో సందర్శకులు షాజహాన్‌తో పాటు ముంతాజ్ ఒరిజినల్ సమాధులను చూసేందుకు వీలుంటుంది. ఇతర సమయాల్లో సందర్శకులకు ఈ అవకాశం ఉండదు. ఉర్సు సమయంలోనే ప్రత్యేకంగా అండర్‌గ్రౌండ్ ద్వారాలను తెరుస్తారు. ఈ సమయంలోనే పర్యాటకులకు షాజహాన్, ముంతాజ్‌ల సమాధులను చూసే అవకాశం వస్తుంది. ఉర్సు తొలిరోజు సమాధులను శుద్ధి చేసి ప్రార్థనలు చేస్తారు. రెండోరోజు సుగంధ ద్రవ్య పరిమిళాల వేడుకలు జరుపుతారు. అలాగే ఖవ్వాలీ జరుగుతుంది. 28న ఖురానా?వనీ, ఖుల్ కార్యక్రమాలు నిర్వహించి చాదర్‌ను అలంకరిస్తారు. మొదటి చాదర్‌ను ఉర్సు కమిటీ అందజేస్తుంది.

# నేడు మందు, మాంసం దుకాణాలు బంద్



**వరంగల్,ప్రజా స్వేచ్ఛ**
గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల్లో ఆదివారం వైన్ షాపులు, మాంసం దుకాణాలు బంద్ కానున్నాయి. శనివారం రాత్రి నుంచి ఎలాంటి జంతువులను వధించరాదని, అన్ని చికెన్, మటన్, చేపల మార్కెట్లు రేపు మూసివేయాలని అధికారులు సూచించారు. ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. చాలా పట్టణాల్లో ఇవే తరహా ఆదేశాలు జారీ అయ్యాయి.

# వ్యాపారులు చేస్తున్నప్పుడు ఐటీ దాడులు సహజమే

**-18 ఏళ్ల తరువాత తమ సంస్థపై దాడులు**
**-దాడులపై అబద్ధపు ప్రచారాలు మాత్రం చేయకండి**
**-కార్యాలయాల్లో రూ.20లక్షల లోపే నగదు : దిల్‌రాజ్**



**హైదరాబాద్‌ప్రజా స్వేచ్ఛ**
టాలీవుడ్ ప్రముఖ నిర్మాత దిల్ రాజు నివాసంలో, ఆఫీసుల్లో నాలుగు రోజుల పాటు ఐటీ రెయిడ్స్ జరిగిన విషయం తెలిసిందే. ఈ దాడులపై నిర్మాత దిల్ రాజు శనివారం మీడియాతో మాట్లాడారు. వ్యాపారాలు చేస్తున్నప్పుడు ఐటీ రెయిడ్స్ జరగడం సాధారణమేనని వివరణ ఇచ్చారు. తనతో పాటు సినీ, వ్యాపార ప్రముఖులపైనా సోదాలు జరిగాయని దిల్ రాజు గుర్తుచేశారు. తమ సంస్థలపై 18 ఏళ్ల తర్వాత ఇప్పుడు రెయిడ్స్ జరిగాయని వివరించారు. ఆదాయపన్ను శాఖ వారు రొటీన్ గా రెయిడ్స్ జరుపుతుంటారని చెప్పారు. తమ సంస్థలకు సంబంధించిన అకౌంట్స్ బుక్స్ చూసి ఐటీ అధికారులే ఆశ్చర్యపోయారని, అకౌంట్స్ అన్నీ క్లియర్ గా ఉన్నాయని చెప్పారన్నారు. అధికారులు వచ్చినపుడు తన ఇంట్లో, ఆఫీసుల్లో మొత్తం రూ.20 లక్షల లోపు నగదు ఉందని చెప్పారు. ఐటీ దాడులు జరుగుతున్నపుడు ఇంట్లో నుంచి ఎవరినీ బయటకు వెళ్లనివ్వరని గుర్తుచేశారు. తన నివాసంపై, ఆఫీసులో జరిగిన ఐటీ దాడుల విషయంలో పుకార్లు ప్రచారం చేయొద్దని మీడియాకు దిల్ రాజు విజ్ఞప్తి చేశారు. ఐటీ దాడులతో తన తల్లికి గుండెపోటు వచ్చిందని ప్రచారం జరిగిందని మీడియాలో ప్రసారం చేశారని విమర్శించారు. తన తల్లి వయసు 81 ఏళ్లని, ఈ నెల 19న (ఐటీ సోదాలు జరుగుతున్న రోజు) ఊపిరితిత్తుల ఇన్ ఫెక్షన్ కారణంగా అస్వస్థతకు గురయ్యారని చెప్పారు. ఆసుపత్రికి వెళ్లి చికిత్స తీసుకుని ప్రస్తుతం ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్నారని తెలిపారు.

# సైఫ్ దాడి కేసులో దర్యాప్తు ముమ్మరం

**-సైఫ్ బ్లడ్ శాంపిల్స్ సేకరణ**
**-సైఫ్ దుస్తులు, నిందితులు దుస్తులు స్వాధీనం**



**న్యూఢిల్లీ,ప్రజా స్వేచ్ఛ**
బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్‌పై దాడి కేసులో విచారణను పోలీసులు వేగవంతం చేశారు. ఇప్పటికే నటుడి వాంగ్మూలం తీసుకున్న పోలీసులు.. తాజాగా సైఫ్ బ్లడ్ శాంపిల్స్‌ను సేకరించారు. ఘటన సమయంలో ఆయన ధరించిన దుస్తులను కూడా స్వాధీనం చేసుకున్నారు. అంతేకాదు, నేరం జరిగిన రోజు నిందితుడు మహ్మద్ షరీఫుల్ ఇస్లాం షెహబాద్ ధరించిన దుస్తులను కూడా స్వాధీనం చేసుకున్నారు. 16వ తేదీ జరిగిన ఘటనలో నిందితుడి దుస్తులపై రక్తపు మరకలు ఉన్నాయని, అవి సైఫ్‌వేనా కాదా అని తెలుసుకునేందుకు పోలీసులు శాంపిల్స్‌ను కలెక్ట్ చేశారు. సైఫ్ దుస్తులు, రక్త నమూనాలతోపాటు నిందితుడి దుస్తులను ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీకి పంపించారు. ఇక దాడి కేసును పోలీసులు అన్ని కోణాల్లో విచారిస్తున్నారు. సైఫ్ కుటుంబ సభ్యులు, ముఖ్యంగా ఆయన భార్య కరీనా కపూర్ పాత్రపైనా దర్యాప్తు చేస్తున్నారు. ఘటనపై కరీనా కపూర్ చెప్పిన వివరాలకు, ఘటన తీరుకు పొంతన కుదరలేదని తెలుస్తున్నది. సైఫ్ పై దాడి జరిగిన సమయంలో కరీనా ఇంట్లోనే ఉంది. ఇంట్లోకి ఒక వ్యక్తి ప్రవేశించాడని, పనిమనిషిపై దాడి చేయడానికి ప్రయత్నించడంతో అతన్ని ప్రతిఘటించే క్రమంలో సైఫ్‌పై దాడి జరిగిందని కరీనా చెప్తూ వచ్చారు. దుండగుడిని గదిలో బంధించామని, తర్వాత అతడు తప్పించుకుపోయాడని పోలీసులకు చెప్పారు. అయితే, పోలీసులు సీన్ రీ క్రియేట్ చేయగా.. ఘటన తీరుకు, సైఫ్ ఇంట్లో వాళ్లు చెప్తున్న సమాచారానికి పొంతన లేదని తెలుస్తున్నది. కరీనా, పని మనిషిని వేర్వేరుగా విచారించి, తర్వాత ఇద్దరిని కలిపి విచారించాలని పోలీసులు భావిస్తున్నారు. అత్యంత భద్రతతో కూడిన అపార్ట్‌మెంట్‌లోకి కుటుంబ సభ్యులు లేదా పనివారి సాయం లేకుండా కొత్త వ్యక్తి ప్రవేశించే అవకాశం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# కుంభమేళాకు భారీగా తరలివస్తున్న భక్తులు

**-73 దేశాలకు చెందిన దౌత్యవేత్తలు రాక**



**ప్రయాగరాజ్, ప్రజా స్వేచ్ఛ**
ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు భారీగా భక్తులు తరలివస్తున్నారు. వైభవంగా కొనసాగుతున్న ఈ కార్యక్రమానికి విదేశాల నుంచి కూడా భక్తులు వస్తున్నారు. ఈ క్రమంలోనే 73 దేశాలకు చెందిన దౌత్యవేత్తలు ప్రయాగ్‌రాజ్‌కు రానున్నట్లు అధికారులు వెల్లడించారు. రష్యా, ఉక్రెయిన్ సహా అమెరికా, జపాన్, జర్మనీ, నెదర్లాండ్, కామెరూన్, కెనడా, స్విట్జర్లాండ్, స్వీడన్, పోలాండ్, బొలీవియా ఇలా 73 దేశాల దౌత్యవేత్తలు తొలిసారి ఇక్కడికి రానున్నారు. ఫిబ్రవరి 1న త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తారని అధికారులు తెలిపారు. ఈ మేరకు ఉత్తరప్రదేశ్ ప్రధాన కార్యదర్శికి విదేశాంగ మంత్రిత్వశాఖ లేఖ రాసింది. ప్రయాగ్‌రాజ్‌కు చేరుకున్న అనంతరం దౌత్యవేత్తలు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. అనంతరం అక్షయావత్, బడే హనుమాన్ ఆలయాన్ని సందర్శిస్తారు. కాగా.. ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళాతో ప్రయాగ్‌రాజ్ కళకళలాడుతోంది. జనవరి 13న మొదలైన కుంభమేళా ఫిబ్రవరి 26 వరకు మొత్తంగా 45 రోజుల పాటు జరగనుంది. విదేశాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. ఇప్పటివరకు 10 కోట్లకు పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు ఇటీవల ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఈ కార్యక్రమం 12 లక్షల తాత్కాలిక ఉద్యోగాలు సృష్టించింది. తాత్కాలిక వైద్య శిబిరాలతో 1.5 లక్షల మంది నర్సులు, పారామెడిక్స్, ఇతర వైద్య సిబ్బందికి అవకాశాలు లభించాయి.

# కుంభమేళాలో సన్యాసం తీసుకున్న నటి



**న్యూఢిల్లీ,ప్రజా స్వేచ్ఛ**
అలహాబాద్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో మాజీ నటి మమతా కులకర్ణి సన్యాసం తీసుకుంది. జనవరి 24న మహాకుంభమేళాకు వెళ్లిన ఆమె మహామండలేశ్వర్ గా మారుతున్నట్లు ప్రకటించింది. తన జీవితం దేవుడికి అంకితం ఇస్తూ.. ఇక నుంచి ఆధ్యాత్మిక బాటలో ప్రయాణించాలి అనుకుంటున్నా అంటూ చెప్పుకొచ్చింది. ఈ సందర్భంగా తన పేరును శ్రీ యామై మమత నందగిరిగా మార్చుకుంది. బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లో ఒకప్పుడు అగ్రతారగా వెలుగు వెలిగింది మమత కులకర్ణి. తాను నటించిన కరణ్ అర్జున్, క్రాంతివీర్, సబ్‌సే బడా ఖిలాడి, కిస్మత్, నజీబ్ సూపర్ హిట్ కావడంతో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. తెలుగులో కూడా ప్రేమ శిఖరంతో పాటు మోహన్ బాబు హీరోగా వచ్చిన దొంగా పోలీస్ చిత్రంలో నటించింది ఈ భామ. అయితే సడన్‌గా తాను నటనకు గుడ్ బై చెబుతున్నట్లు ప్రకటించి అందరిని షాక్‌కి గురిచేసింది. ఇక 20 ఏండ్ల క్రితం నటనను వదిలేసి విదేశాల్లో వెళ్లి స్థిరపడింది మమత.. తాజాగా మహకుంభమేళలో కనపడడం.. సన్యాసం తీసుకోవడం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారాయి.

# అదనపు న్యాయమూర్తులుగా నలుగురు జడ్జిలు ప్రమాణస్వీకారం

**హైదరాబాద్,ప్రజా స్వేచ్ఛ**
తెలంగాణ హైకోర్టుకు కొత్తగా నియమితులైన నలుగురు అదనపు న్యాయమూర్తులు ప్రమాణస్వీకారం చేశారు. జస్టిస్ రేణుకా యారా, జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు, జస్టిస్ ఇ.తిరుమలదేవి, జస్టిస్ బి.ఆర్.మధుసూదన్‌రావుతో హైకోర్టు సీజే జస్టిస్ సుజయ్ పాల్ ప్రమాణం చేయించారు. ఇంతకుముందు రేణుక యారా సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జిగా, నందికొండ నర్సింగ్‌రావు సిటీ స్మాల్ కాజెస్ కోర్టు చీఫ్ జడ్జిగా, ఇ.తిరుమలాదేవి హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్, విజిలెన్స్ రిజిస్ట్రార్‌గా, బి.ఆర్.మధుసూదన్‌రావు హైకోర్టు రిజిస్ట్రార్(పరిపాలన)గా బాధ్యతలు నిర్వర్తించారు.

# ఫోన్ ట్యాపింగ్‌లో మరో మలుపు

**-త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి ఫోన్ ట్యాప్**



**హైదరాబాద్,ప్రజా స్వేచ్ఛ**
ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి ఫోన్ ట్యాపింగ్ అయినట్లు పోలీసులు గుర్తించారు. 2023 నవంబర్ నుంచి 15 రోజుల పాటు ఆయన ఫోన్‌ను ట్యాప్ చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో గవర్నర్ పీఏ నర్సింహ స్టేట్మెంట్‌ను జూబ్లీహిల్స్ పోలీసులు రికార్డు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తన ఫోన్ ట్యాపింగ్ అయిందని ఇంద్రసేనారెడ్డి ఇప్పటికే చెప్పిన విషయం తెలిసిందే. దర్యాప్తులో భాగంగా ఆయన పీఏ స్టేట్మెంట్‌ను పోలీసులు రికార్డ్ చేశారు.ప్రతిపక్ష నేతలు, ప్రజా సంఘాల నేతలే టార్గెగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిందని, ఇందులో నాటి ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్ రావు కీలకంగా వ్యవహరించారని మాజీ డీఎస్పీ దుగ్యాల ప్రణీత్ రావు విచారణలో గుట్టు బయట పెట్టిన సంగతి తెలిసిందే. దీంతో ప్రభాకర్?రావును ఈ కేసులో ప్రధాన నిందితుడి(ఏ1)గా పోలీసులు చేర్చారు. ఫోన్ ట్యాపింగ్ జరిగిన విధానాన్ని విచారణలో దర్యాప్తు అధికారులకు ప్రణీత్ రావు, భుజంగరావు, తిరుపతన్న వెల్లడించారు. నాడు ఇంటెలిజెన్స్ చీఫ్?గా ఉన్న ప్రభాకర్ రావు ఆదేశాల మేరకే ఫోన్ ట్యాపింగ్ చేసినట్టు ఒప్పుకున్నారు. నాటి ప్రభుత్వ పెద్దలు, ప్రభాకర్ రావు నుంచి అందిన ఫోన్? నంబర్ల ఆధారంగా ట్యాపింగ్ చేసేవాళ్లమని తెలిపారు. వందల సంఖ్యలో ఫోన్ నంబర్స్ అందేవని చెప్పారు. అప్పటి ప్రతిపక్ష నేత రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల ఇండ్ల పరిసరాల్లో ట్యాపింగ్ సెంటర్స్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా సేకరించిన సమాచారాన్ని ప్రభాకర్‌రావుకు అందించేవాళ్లమని తెలిపారు. అసెంబ్లీ ఫలితాలు వెలువడిన వెంటనే ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు ట్యాపింగ్ డివైజ్?లు, హార్డ్ డిస్క్?లను ధ్వంసం చేసినట్లు ఈ ముగ్గురూ విచారణలో అంగీకరించినట్టు పోలీసులు ఇప్పటికే పేర్కొన్నారు.

# నేటి నుంచే ఆ నాలుగు పథకాలకు శ్రీకారం

(మొదటి తరువాయి)

కంట్రోల్ సెంటర్‌లో మంత్రులు, అధికారులతో ఆయన పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. సంక్షేమ పథకాల అమలుపై చర్చించారు. గ్రామాల్లోని లబ్దిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిజమైన లబ్ధిదారుల్లో ఏ ఒక్కరికీ అన్యాయం జరగవద్దని సూచించారు. అనర్హులకు లబ్ది చేకూరిస్తే ఆయా అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు నాలుగు పథకాలను తెలంగాణ సర్కార్ లాంఛనంగా ప్రారంభించనుంది. హైదరాబాద్ మినహా రాష్ట్రంలోని అన్ని మండలాల్లో మండలానికో గ్రామాన్ని ఎంపిక చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. నాలుగు పథకాలకు ఒక్కో పథకానికి ఒక్కో అధికారి చొప్పున గ్రామానికి నలుగురు మండలస్థాయి అధికారులను నియమించాలని తెలిపింది. ఫిబ్రవరి మొదటివారం నుంచి మార్చి 31లోగా రాష్ట్రంలోని మిగతా గ్రామాల్లో లబ్ధిదారులకు పథకాలు అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. మార్చి 31 లోపు నాలుగు పథకాలు వంద శాతం అమలు జరిగేలా చూడాలి.. నిజమైన లబ్దిదారులకు ఒక్కరికి కూడా అన్యాయం జరగొద్దు.. అనర్హులకు లబ్ది చేకూరిస్తే అధికారులపై చర్యలు తప్పవని సర్కార్ హెచ్చరించింది. సంక్షేమ పథకాల కోసం లక్షలాది దరఖాస్తులు వచ్చాయని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. లబ్దిదారుల వెరిఫికేషన్ కోసం గ్రామసభలు నిర్వహించామని, ఇచ్చిన హామీ మేరకు రేపటి నుంచి పథకాల ప్రారంభిస్తామన్నారు. మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. పవిత్రమైన గణతంత్ర దినోత్సవం రోజున ఇచ్చిన మాట ప్రకారం నాలుగు పథకాలు ప్రారంభిస్తున్నామన్నారు. మండలానికి ఒక గ్రామం యూనిట్‌గా తీసుకొని నాలుగు పథకాలు అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. అర్హత కలిగిన ప్రతి వ్యక్తికి పథకాలు అందిస్తామని, మార్చి వరకు పక్రియ పూర్తి చేస్తామని భట్టి స్పష్టం చేశారు. పథకాల్లో ఎలాంటి సీలింగ్ లేదని, అర్హులందరికీ అందిస్తామన్నారు. ఇండ్లు, రేషన్ కార్డుల కోసం ఎక్కువ దరఖాస్తులు వచ్చాయన్నారు. వ్యవసాయం చేసే ప్రతీ ఒక్కరికి రైతు భరోసా ఇస్తామని భట్టి వివరించారు. నాలుగు కొత్త పథకాలు ప్రారంభించబోతున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. లబ్దిదారుల ఎంపిక కోసం గ్రామ సభలు నిర్వహించామని చెప్పారు. గ్రామాల్లో పథకాల కోసం లక్షల అప్లికేషన్లు వచ్చాయన్నారు. నవరి 26 నుంచి ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభిస్తామని చెప్పారు. వ్యవయసాయ యోగ్యమైన భూములకు రైతు భరోసా ఇస్తామన్నారు. రేషన్ కార్డుల విషయంలో ఎవరూ ఆందోళన చెందొద్దని చెప్పారు మంత్రి ఉత్తమ్. రేషన్ కార్డుల జారీ నిరంతర పక్రియ అని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇస్తామని తెలిపారు. ఒక్కో వ్యక్తికి 6 కిలోల సన్నబియ్యం పంపిణీ చేస్తామన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రేపు నాలుగు సంక్షేమ పథకాలు మండలంలోని ఒక గ్రామంలో మధ్యాహ్నం 1 గంటలకు లాంఛనంగా ప్రారంభిస్తామని తెలిపారు. రేషన్ కార్డులు, ఇండ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా ఇస్తామని అన్నారు. రేషన్ కార్డుల జారీ నిరంతర పక్రియ.. గతంలో దరఖాస్తు ఇచ్చినా, సర్వేలో వివరాలు ఇచ్చినా ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోక పోయినా ఇప్పుడు ప్రజాపాలన కేంద్రాల్లో ఇవ్వండని అన్నారు. బీపీఎల్ కుటుంబాలందరికి రేషన్ కార్డులు ఇవ్వాలని క్యాబినెట్ నిర్ణయించిందని పేర్కొన్నారు.

# లక్ష్యం దిశగా దేశం పయనం

(మొదటి తరువాయి)

సందర్భంగా జాతిని ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగించారు. 'అంతర్జాతీయంగా నాయకత్వం వహించేలా భారత్ ఎదిగింది. భరతమాత విముక్తి కోసం త్యాగాలు చేసిన వారిని స్మరించుకోవాల్సిన తరుణమిదని అన్నారు.. ఈ ఏడాది బిర్సా ముండా 150వ జయంతిని జరుపుకొన్నాం. వెలుగులోకి రాని మరికొందరు ధైర్యవంతులను స్మరించుకోవాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా చట్టాలు మార్చుకున్నాం. ఈ ఏడాది కొత్త చట్టాలు రూపొందించి అమల్లోకి తెచ్చాం' అని రాష్ట్రపతి తెలిపారు. ఎన్నో ఏళ్ల పోరాటం తర్వాత 1947 ఆగస్టు 14వ తేదీ అర్ధరాత్రి మనకు స్వాతంత్య్రం వచ్చినప్పటికీ, 1950 జనవరి 26న భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చింది. మనం ఈరోజు స్వేచ్ఛగా బతుకుతున్నా మంటే స్వాతంత్య్రం కోసం పోరాడిన యోధుల చలవే. అయితే ఈ విషయం గురించి చాలా మందికి

తెలియకపోవడం విచారకరం. అలాగే 1950 జనవరి 26 నుంచి రాజ్యాంగం అమల్లోకి వచ్చింది... కాబట్టి ప్రతి ఏటా ఇదే రోజున రిపబ్లిక్ డే జరుపుకుంటున్నామని భావిస్తారు. ఇందులో కాస్త నిజం లేకపోలేదు. అయితే దీని వెనుక బలమైన కారణం ఉంది. వాస్తవానికి భారత రాజ్యాంగాన్ని 1949 నవంబరు 26నే ఆమోదించారు. దీనిని అమలు చేసే తేదీకి ఒక ప్రాముఖ్యత ఉండాలనే ఉద్దేశంతో రెండు నెలలు వేచి ఉన్నారు. లాహోర్ వేదికగా 1930 జనవరి 26న కాంగ్రెస్ పార్టీ జాతీయ సమావేశంలో తొలిసారిగా సంపూర్ణ స్వరాజ్యం తీర్మానం చేశారు. నెహ్రూ సారథ్యంలో రావీ నది ఒడ్డున త్రివర్ణ పతాకం ఎగురవేసి భారతీయుల స్వాతంత్ర సంకల్పాన్ని బ్రిటిషర్లకు గట్టిగా వినిపించారు. అప్పటి దాకా కేవలం రాజకీయ, ఆధ్యాత్మిక స్వాతంత్రం వస్తే చాలు, సంపూర్ణ అధికారం బ్రిటిష్ వారి చేతుల్లోనే ఉండి, దేశం సామంత రాజ్యంగా మిగిలిపోయినా ఫర్వాలేదనుకునేలా ఉన్న రాజకీయ నేతల వైఖరిని జలియన్‌వాలాబాగ్ ఉదంతం ఒక్కసారిగా కళ్లు తెరిపించింది. ఆ÷ూడు సుభాష్ చంద్రబోస్, జవహర్‌లాల్ నెహ్రూ లాంటి నేతలు కాంగ్రెస్ పార్టీలో వేడి పుట్టించి పూర్ణ స్వరాజ్య తీర్మానం ప్రకటన చేయించడంలో సఫలమయ్యారు. ఆ రోజునే స్వాతంత్ర దినోత్సవంగా పరిగణించాల్సిందని కాంగ్రెస్ పార్టీ కూడా దేశ ప్రజలకు పిలుపు ఇచ్చింది. జనవరి 26, 1950 నుంచి బ్రిటీష్ కాలం నాటి భారత ప్రభుత్వ చట్టం -1935 రద్దయ్యింది. భారతదేశం సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా అవతరించింది. దేశానికి రాజ్యాంగం ఉండాలని భావించిన నాటి దార్శనికులు, మేధావులు రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పాటు చేశారు. దీనికి అధ్యక్షుడిగా డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్‌ను ఎన్నుకోగా, రాజ్యాంగ రచనా ముసాయిదా కమిటీ ఛైర్మన్‌గా డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌ను నియమించారు. ÷ూజ్యాంగ రచనకు ఎంతోమంది మేధావులు వివిధ దేశాల రాజ్యాంగాలను పరిశీలించి, అధ్యయనం చేసి ప్రజాస్వామ్య విధానంలో రూపొందించారు. అనేక సవరణల అనంతరం, 1949 నవంబర్ 26న దీనిని రాజ్యాంగ పరిషత్ ఆమోదించింది.

# మోడీ ఫోటో పెట్టాల్సిందే

(మొదటి తరువాయి)

కార్డులు ఇవ్వబోమన్నారు. తామే ముద్రించి ప్రజలకు రేషన్ కార్డులు ఇస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మాజీ సీఎం కేసీఆర్ మీద ఆయన విమర్శలు గుప్పించారు. కొత్త రేషన్ కార్డులపై సీఎం రేవంత్ రెడ్డితో పాటు ప్రధాని మోదీ ఫొటో ముద్రించాల్సిందేనని అన్నారు. రేషన్ కార్డులపై ప్రధాని ఫొటో పెట్టకపోతే ఉచిత బియ్యం ఎందుకివ్వాలని ప్రశ్నించారు. ప్రధాని ఫొటో పెట్టకపోతే పేదలకు కేంద్రమే నేరుగా ఉచిత బియ్యం అందించే అంశంపై ఆలోచన చేస్తామన్నారు. కరీంనగర్ మేయర్ సునీల్ రావు భాజపాలో చేరిన అనంతరం బండి సంజయ్ మాట్లాడారు. 'ఎప్పుడు ఎన్నికలు జరిగినా కరీంనగర్ కార్పొరేషన్ భాజపాదని అన్నారు. కేంద్రం నుంచి నిధులు తెచ్చినా గత పదేళ్లలో ఏనాడూ భారాస నేతలు నన్ను పిలవలేదు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టుకు నేను నిధులు తీసుకొస్తే.. వాళ్లు పనులు ప్రారంభించారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టు నిధులను దారిమళ్లిస్తే.. కొట్లాడి మరీ అడ్డుకున్నానని అన్నారు. కరీంనగర్ కోసం ఎంత కష్టపడినప్పటికీ నన్ను ఏనాడూ ప్రభుత్వ కార్యక్రమాలకు పిలవకుండా దూరంపెట్టారు. మోదీ ప్రభుత్వం అందించిన నిధులతోనే కరీంనగర్‌లో అభివృద్ధి జరిగిందని ప్రజలకు అర్థమైంది. భారాస పాలనలో అవినీతి, అక్రమాలకు అంతులేకుండా పోయింది. మాజీ సీఎం కేసీఆర్ అడుగుజాడల్లోనే కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నడుస్తున్నారు' అని బండి సంజయ్ దుయ్యబట్టారు. రేవంత్‌కు గురువు కేసీఆరేనని బండి సంజయ్ అన్నారు. 'రేవంత్‌కు కేసీఆరే గురువు. కేసీఆర్ ఏం చేశారో.. రేవంత్ అదే చేస్తున్నారు. రేవంత్ పనిలో కొత్తదనం ఏమీ లేదు. ఫోన్ ట్యాపింగ్ కేసు ఏమైంది? కాళేశ్వరం అవినీతి ఎక్కడకు పోయింది? కేసీఆర్‌ను జైల్లో ఎందుకు వేయడం లేదు? రేపే అరెస్ట్ అని ఇంకా ఎన్ని రోజులు అంటారు? ఫార్ములా కారు రేసు కేసులో కేటీఆర్‌ను ఎందుకు అరెస్ట్ చేయడం లేదు? గ్రీన్ కో కంపెనీ నుంచి కాంగ్రెస్‌కు డబ్బులు ముట్టాయ్. దావోస్‌కు రెండుసార్లు పోయినా.. పెట్టుబడులపై స్పష్టత లేదు. శ్వేత పత్రం విడుదల చేయాలి' అని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# నిగ నీడలో దేశ రాజధాని

(మొదటి తరువాయి)

పైగా పోలీసులను మోహరించడంతో పాటు విస్తృత భద్రతా చర్యలు చేపట్టారు. సెక్యూరిటీ సిబ్బంది ఎక్కువగా ఉండటంతో పాటు డ్రోన్లు, సీసీటీవీ నిఘా, సైబర్ స్పెషలిస్టులతో నగర పర్యవేక్షణ ఉంటుంది. వేడుకలను సజావుగా నిర్వహించేందుకు ఆరు లేయర్ల తనిఖీలు, ఫ్రిస్కింగ్‌లతో బహుళస్థాయి భద్రతా ఏర్పాట్లు ఉంటాయి. ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్స్ (ఎఫ్‌ఆర్‌ఎస్)తో సహా వేలాది సీసీటీవీ కెమెరాలు, ప్రాంతాలను పర్యవేక్షించడానికి మొబైల్ ఎఫ్‌ఆర్‌ఎస్-అనుకూల వాహనాలను న్యూఢిల్లీలో ఏర్పాటు చేశారు. ఈ కెమెరాలు అనుమానాస్పద వ్యక్తులను వెంటనే గుర్తించడం కోసం క్రిమినల్ డేటాబేస్‌కు లింక్ చేయబడతాయి. పోలీసు బృందాలు పలు ఏజెన్సీలతో మాక్ డ్రిల్‌లు నిర్వహిస్తున్నాయి. అన్ని జిల్లాల డీసీపీలకు సమాచారమందించామనీ, ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు జరిగినా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. "మేము ఇప్పటికే బహుళ లేయర్డ్ భద్రతా ఏర్పాట్లను చేశాం. మా వద్ద ఆరు పొరల తనిఖీ, ఫ్రిస్కింగ్ ఏర్పాట్లు ఉన్నాయి. ఇది కాకుండా, మేము బహుళ లేయర్డ్ బారికేడింగ్ ఏర్పాటు చేశాం. న్యూఢిల్లీ జిల్లాలో ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్స్‌తో సహా వేల సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశాం" అని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. న్యూఢిల్లీ, ఉత్తర, మధ్య జిల్లాల్లో దాదాపు 4,000 రూఫ్‌టాప్ సెక్యూరిటీ పాయింట్లను గుర్తించారు. పరేడ్‌కు హాజరైనవారికి భద్రతా స్టిక్కర్‌లను అందిస్తారు.

# రైతుల ఆత్మహత్యలపై స్పందనేదీ

(మొదటి తరువాయి)

నర్సయ్య అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర విచారకరం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే గడిచిన వారం రోజుల్లో నలుగురు రైతులు ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరం. రైతుల మరణ మృదంగం జరుగుతుంటే రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ఏం చేస్తున్నట్లు కాంగ్రెస్ పాలనలో రైతన్నకు భరోసా లేక మనోధైర్యం కోల్పోతున్నడు. అందరికి అన్నం పెట్టే అన్నదాతకు సున్నం పెడుతున్నది కాంగ్రెస్ పార్టీ అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. నమ్మి ఓటేసిన పాపానికి నట్టేట ముంచి, నమ్మక ద్రోహం చేస్తున్నది. రుణమాఫీ పూర్తి చేసినట్లు రంకెలేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. అప్పులు తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతున్న రైతులకు ఏమని సమాధానం చెబుతారు అని హరీశ్‌రావు నిలదీశారు. రైతుల ఆత్మహత్యలకు కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలి. ఆ రైతు కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. ఆత్మహత్యలు పరిష్కారం కావు, బతికుండి కొట్లాడుదాం. అధైర్య పడొద్దు, బీఆర్ఎస్ పార్టీ మీకు అండగా ఉంటుందని పిలుపునిస్తున్నా అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం

(మొదటి తరువాయి)

ఈ మేరకు ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో, ప్రధాని మోదీ మధ్య జరిగిన సమావేశంలో ఒప్పందం కుదిరింది. సుబియాంతో మూడు రోజుల భారత్ పర్యటనకు వచ్చిన సంగతి తెలిసిందే. ఆదివారం దిల్లీలోని కర్తవ్య పథ్‌లో జరగనున్న రిపబ్లిక్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. శనివారం సమావేశం ముగిసిన అనంతరం ఇరుదేశాల నేతలు మీడియాతో మాట్లాడారు. భారత్‌కు ఇండోనేసియా కీలక భాగస్వామి అని మోదీ వ్యాఖ్యానించారు. 10 సభ్యదేశాలు కలిగిన ఆసియాన్‌తో పాటు ఇండో పసిఫిక్ కూటమిలో ఇండోనేసియాకు భారత్ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా సంబంధాలను నెరపేందుకు ఇరుదేశాలు అంగీకరించినట్లు తెలిపారు. ద్వైపాక్షిక విధానాలకు సంబంధించి వివిధ అంశాలపై చర్చించినట్లు మోదీ వెల్లడించారు. రక్షణ ఉత్పత్తుల తయారీ రంగంలో భారత్, ఇండోనేసియా కలిసి పని చేయబోతున్నట్లు చెప్పారు. ఇండో పసిఫిక్ ప్రాంతంలో చైనానౌకల సంచారం పెరుగుతున్న నేపథ్యంలో సముద్ర రక్షణను బలోపేతం చేసే దిశగా ఇరు దేశాల మధ్య కీలక ఒప్పందం జరిగింది. కృత్రిమమేధ, ఇంటర్నెట్, డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పనపై ఇరుదేశాలు పరస్పర సహకార ఒప్పందం కుదుర్చుకున్నాయి. ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపర్చుకునేందుకు ఇండోనేసియా కూడా సిద్ధంగా ఉందని ఆ దేశ అధ్యక్షుడు సుబియాంతో అన్నారు. ఫిన్‌టెక్, ఏఐ, ఐవోటీ, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్టక్చ్రర్ వంటి రంగాల్లో సహకారాన్ని మరింత పెంపొందించుకోవాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

# నేటి నుంచి రైతు భరోసా

(మొదటి తరువాయి)

ఎకరాకు రూ.12 వేలు ఇస్తామని ప్రకటించింది. రైతులకు పెట్టుబడి సాయాన్ని ఈ నెల 26 నుంచి అందజేస్తామని ప్రకటించిన ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. వ్యవసాయానికి యోగ్యంగా లేని భూములను గుర్తించడానికి అధికారులు గ్రామాల్లో పర్యటించి సభల ద్వారా వివరాలు సేకరించారు. ఈనెల 20 వరకు భూముల గుర్తింపు పక్రియ నిర్వహించగా, 21 నుంచి 24వ తేదీ వరకు గ్రామసభలు ఏర్పాటు చేసి అనర్హుల జాబితాను ప్రదర్శించారు. భూ భారతి పోర్టల్‌లో నమోదై ఉన్న వ్యవసాయ యోగ్యమైన భూములకు ఎకరాకు ఏడాదికి రూ.12 వేలు అందించనున్నారు. ఇండ్లు, కాలనీలుగా మారిన భూములు, లే అవుట్లు, రోడ్లుగా మారిన భూములు, పరిశ్రమలు, గోదాములు, మైనింగ్‌కు ఉపయోగించేవి, రాళ్లు, రప్పలు, గుట్టలతో నిండి సాగుకు అనుగుణంగా లేని భూములకు రైతు భరోసా వర్తించదు. వ్యవసాయానికి యోగ్యంగా లేని భూములను గుర్తించడానికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. గ్రామాలవారీగా భూముల గుర్తింపు పక్రియ చేపట్టారు. ప్రతి గ్రామ పట్టాదారు పాసు పుస్తకాల జాబిజాతో పాటు విలేజ్, గూగుల్ మ్యాప్ సహాయంతో గ్రామాల్లో పర్యటించి భూములను పరిశీలించారు. అనంతరం మండల తహసీల్దార్, వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల్లోని సర్వే నంబర్లను పరిశీలించి సాగులో లేని భూములను నిర్ధారించారు.

# కేసీఆర్ సోదరి సకలమ్మ మృతి

(మొదటి తరువాయి)

ఉదయం మునిరాబాద్‌లోని ఆమె నివాసానికి చేరుకున్న కేసీఆర్.. సోదరి పార్థివదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులు, బంధువులను ఓదార్చారు. కెసిఆర్‌తో పాటు కెటిఆర్, హరీష్ రావు తదితరులుకూడా నివాళి అర్పించారు. సకలమ్మ అంతిమయాత్ర కొనసాగుతున్నది. పూడూరులోని స్మశానవాటికలో ఆమె అంత్యక్రియలు జరిగాయి. అంతిమయాత్రలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే హరీశ్ రావు, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కాగా, కేసీఆర్‌కు సకలమ్మ 5వ సోదరి. ఆమె స్వగ్రామం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పెదిర. భర్త హన్మంతరావు కొన్నేండ్ల క్రితమే మృతిచెందారు. వారికి ముగ్గురు కుమారులు ఉన్నారు.

# సనాతన ధర్మం ఓ మహా వటవృక్షం

(మొదటి తరువాయి)

కార్యరూపంలోకి రావాలంటే ఓర్పు అవసరమని, ఓర్పులేకుంటే ఏమీ సాధించలేమని అన్నారు. 'సనాతన్' అనేది ఒక పెద్ద వటవృక్షమని, చిన్నచిన్న పొదలతో దానితో పాల్చరాదని సూచించారు. మహాకుంభమేళాలో అతిపెద్ద సంత్ సమ్మేళన్ నిర్వహించిన వీహెచ్‌పీ కృషిని యోగి ఆదిత్యనాథ్ అభినందించారు. 'మహాకుంభ్ నగర్‌లో భారతదేశ సనాతన సంప్రదాయాన్ని యావత్ ప్రపంచం వీక్షించింది. ఇంతపెద్ద ఈవెంట్‌ను అత్యంత వైభవోపేతంగా నిర్వహించిన వీహెచ్‌కి, నిర్వాహకులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నారు. అయోధ్యలో రాముల వారి ప్రతిష్ట కోసం 500 ఏళ్ల వేచిచూశాం. ఎట్టకేలకు అయోధ్యకు రాముడు తిరిగివచ్చిన విషయాన్ని మనమంతా గుర్తుంచుకోవాలి' అని అన్నారు. విశ్వసనీయత, అధునికత మేళవించిన మహాకుంభ్‌ను ఇప్పుడు మనమంతా చూస్తున్నామని ఆదిత్యనాథ్ అన్నారు. ' సనాతన ధర్మాన్ని ఆచరించే ప్రతి ఒక్కరూ గత ఏడాది 500 ఏళ్ల నిరీక్షణకు తెరపడి, అయోధ్యలో భవ్యరామాలయ నిర్మాణం జరగడం చూశారు. యావత్ ప్రపంచం వీక్షించింది. 2016లో 2 లక్షల 36 వేల మంది భక్తులు అయోధ్యను సందర్శించే 2024లో ఆ సంఖ్య 10 నుంచి 12 కోట్లకు చేరుకుంది' అని తెలిపారు. గత పది రోజుల్లో 10 కోట్ల మంది భక్తులు మహాకుంభ్‌లో పవిత్ర స్నానాలు ఆచరించారని, రాబోయే 35 రోజుల్లో ఈ సంఖ్య 45 కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నామని యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. మహాకుంభ్ ఆధ్యాత్మిక కార్యక్రమం ఐక్యతా సందేశాన్ని చాటుతోందని, ప్రపంచంలోని నలుమూలల ప్రజలను మహాకుంభ్‌కు ఆహ్వానించామని చెప్పారు. ఇక్కడ అన్నపానాదులు, బసకు ఎలాంటి కొరతా లేదని చెప్పారు. సామరస్యం, కరుణ, అందరూ ఒక్కటేనన్న సందేశాన్ని మహాకుంభ్ ద్వారా ప్రపంచానికి చాటిచెప్పనున్నట్టు యోగి తెలిపారు.

## సంపాదకీయం

# ప్రహసనంగా ఓటర్ల దినోత్సవం !

ఏటా జాతీయ ఓటర్ల దినోత్సవం ఓ ప్రహసనంగా సాగుతోంది. దేశ ఓటర్లలో చైతన్యం కలిగించండంలో.. పక్కాగా ఆధార్ తరహాలో ఓటరు కార్డు అందించడంలో... కచ్చితంగా పౌరులంతా ఓట్లు వేసేలా చర్యలు తీసుకోవడంలో..ఎన్నికల సంఘం విఫలం అవుతూనే ఉంది. ఒక్క శేషన్ కాలంలో తప్ప ఎప్పుడు కూడా ఎన్నికల సంఘం పటిష్టంగా పనిచేయలేకపోయింది. ఎన్నికల సంఘం ఉందన్న బయం లేకుండా పోయింది. ఓట్లు నమోదు చేసుకోవడం మొదలు, ఓట్లను నిలబెట్టుకోవడం, అడ్రస్ మార్పించుకోవడం వంటివన్నీ ఓ ప్రహసనంగా మారాయి. ప్రజాస్వామ్యంలో బలమైన ప్రభుత్వం ఏర్పడడానికి ఓటే ఆయుధం. కానీ ఆ ఓటు బలంగా, నిర్భయంగా వేయగలిగేలా చర్యలు తీసుకోవడం లేదు. ఎన్నికల్లో 40,50 శాతం మించి ఓట్లు నమోదు కావడం లేదు. ఓటేయకున్నా ఫర్వాలేదన్న వాదన బలపడి పోయింది. ఓటేయకుంటే క్రమశిక్షణా చర్యలు లేవు. దేశంలో పక్కాగా ఓటు నమోదు..పక్కాగా ఓటరు కార్డు, ఓటేయకపోతే చర్యలు వంటివి ఉండాల్సిందే. అప్పుడే జాతీయ ఓటరు దినోత్సవానికి అర్థం ఉంటుంది. జాతీయ ఓటర్ల దినోత్సవాన్న ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘనంగా నిర్వహిస్తున్నాయి. ప్రతి ఏటా జనవరి 25న భారతదేశం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకుంటోంది. 1950లో భారత ఎన్నికల సంఘం స్థాపించిన రోజును గుర్తు చేసుకుంటూ కేంద్రం ప్రతి ఏటా వేడుకలు నిర్వహిస్తోంది. ఎన్నికల్లో ఓటర్లను భాగస్వామ్యం చేసేందుకు, ఓటింగ్ ప్రాముఖ్యత తెలియజేసేందుకు 2011 నుంచి ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉన్న నేపథ్యంలో వారిని ఓటింగ్ వైపు పోత్సహించేలా ఏటా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 'నైథింగ్ లైక్ ఓట్.. ఐ ఓట్ ఫర్ ష్యూర్' థీమ్‌తో దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అయితే ఓటేయకుండా ఉంటున్న వారిలో అత్యధిక శాతం యువతే అని గుర్తించాలి. దేశంలో యువతీ, యువకులు ఓటర్లుగా నమోదు చేసుకునేలా ప్రోత్సహించేందుకు 2011లో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ప్రవేశపెట్టారు. చాలా మంది అర్హత గల యువత ఓటర్లుగా నమోదు చేసుకోవడం లేదని అప్పటి కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ సమస్యను అధిగమించేందుకు చొరవ చూపింది. ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని అప్పటి ప్రభుత్వం.. యువతను ఓటర్లుగా నమోదు చేయించడం, వారికి ఓటర్ గుర్తింపు కార్డులు మంజూరు చేయడంపై దృష్టి పెట్టింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం అమలు లోకి వచ్చిన రోజును ఒక ప్రత్యేక దినోత్సవంగా నిర్వహించాలని నిర్ణయించింది. దానికి జాతీయ ఓటర్ల దినోత్సవంగా నామకరణం చేసింది. అప్పటి నుంచి ప్రతి ఏటా జనవరి 25న వేడుకగా ఈరోజును క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. అయితే ప్రజల్లో నిర్లిప్తతత, రాజకీయాల ప్రమేయం వంటివన్నీ దీనిని నీరుగారుస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్క ఓటరూ బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవడం జాతీయ ఓటర్ల దినోత్సవం ప్రధాన ఉద్దేశం. అందు కోసం ఈ రోజున వారికి ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి, 18సంవత్సరాలు నిండిన యవతను ఓటర్లుగా నమోదు చేయిస్తుంటారు. అలాగే ఎన్నికల పక్రియలో వారంతా చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహించడం ఓటర్ల దినోత్సవ ప్రధాన లక్ష్యం. మొదటిసారి ఓటర్‌గా నమోదు చేసుకునే వారికి సహాయం చేయడం, నూతన ఓటర్ గుర్తింపు కార్డులు అందించడం వంటి పనులు అధికారులు చేస్తుంటారు. అలాగే ఓటింగ్ ప్రాముఖ్యత తెలియజేసేలా బహిరంగ ర్యాలీలు, చర్చలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఓటింగ్ పక్రియ, ఓటు ప్రభావం గురించి అవగాహన కల్పించే ప్రచారాలు చేస్తున్నారు. అలాగే అక్షరాస్యతను ప్రోత్సహించడంలోనూ జాతీయ ఓటర్ల దినోత్సవం కీలక పాత్ర పోషిస్తోంది. 'ప్రతి ఓటు లెక్కించబడుతుంది. మీ స్వంత ప్రజాస్వామ్యంలో ప్రేక్షకుడిగా ఉండకండి. మీ ఓటు హక్కును వినియోగించుకోండని జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. బుల్లెట్ కన్నా బ్యాలెట్ బలమైనది. 'ఓటు విలువైనది. ఇది అత్యంత పవిత్రమైనది. ప్రజాస్వామ్యంలో మనకు ఉన్న అత్యంత శక్తివంతమైన సాధనం ఓటు అన్న విషయాన్ని ఏటేటా గుర్తు చేస్తున్నా..భారతీయ ఓటర్లలో నిర్లిప్తత తొలగించలేకపోతున్నాం. ఓ మంచి నేతను ఎన్నుకో వాలంటే ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభం లాంటిది. అందుకే ప్రజలు కూడా ఓటు విలువ తెలుసుకోవాలి. లేకుంటే ఎవరో కొందరు ఎన్నికవుతూ..మనమీద స్వారీ చేస్తుంటారు. మనం ఓటు వేయ కున్నా పాలకులుగా ఉంటారు. ఇదిలావుంటే ఎన్నికల సంఘం అధికార పార్టీకి కీలుబొమ్మగా మారిందన్న విమర్శలు ఉన్నాయి. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఎన్నికల సంఘం పనితీరుపై భాజపా, కాంగ్రెస్‌ల మధ్య పోస్టల వార్ నడిచింది. ఈసీపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించగా.. కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేశారు. నిజానికి ఎవరు అధికారంలో ఉన్నా ఇసి పనిచేసుకునేలా చేయడం లేదు. వేలుపెట్టడం ఎక్కువైంది. జాతీయ ఓటర్ల దినోత్సవం అనేది శక్తిమంతమైన మన ప్రజాస్వామ్యానికి గుర్తు. ఇది ప్రతి పౌరుడికి తన ఓటు హక్కును వినియోగించుకొనే అవకాశాన్ని కల్పిస్తుంది. మన భవిష్యత్తుకు ఇది ఎంతో ప్రాముఖ్యమైనది. ఈ విషయంలో ఎన్నికల సంఘం పనితీరును మెరుగు పర్చుకుని స్వతంత్రంగా పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయి. పోలింగ్ పక్రియను ఆధునీకీకరించడంతో పాటు ప్రజలు స్వేచ్ఛగా ఓటేసేలా, ఓటు నమోదును పద్దతిగా చేసేలా ప్రక్రియను బలోపేతం చేసేందుకు ఈసీ కృషి చేయాల్సి ఉంది. అయితే గత పదేళ్లుగా భారత ఎన్నికల సంఘం పనితీరు క్షీణించిందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. ఎవరెన్ని విమర్శలు చేసినా... మన ఎన్నికల పక్రియ ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలందుకొని, ఆదర్శంగా నిలిచిందనే చెప్పాలి. ప్రతి పౌరుడికి ఓటుహక్కు అనేది పట్టణస్థాయి నుంచి అట్టడుగు స్థాయి వరకు విస్తరించింది. మన ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి మన సంస్థల స్వతంత్రతను కాపాడుకోవడం ముఖ్యం. అందుకు మరింతగా ఇసి బలోపేతం కావాల్సిన అవసరం ఉంది.

# గణతంత్రం 75




75"భారత ప్రజలమైన మేము, భారతదేశాన్ని సర్వసత్తాక సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా నిర్మించుకోవడానికి, పౌరులందరికీ %-% సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని, భావ ప్రకటన, విశ్వాసం, ఆరాధనల స్వాతంత్ర్యాన్ని, అవకాశాల్లో, అంతస్తుల్లోనూ సమానత్వాన్ని చేకూర్చడానికి, జాతీయ సమైక్యతను సంరక్షిస్తూ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడానికి మాకు మేము సమర్పించుకుంటున్నాము". ఇది రాజ్యాంగ పీఠిక సారాంశం. దీని యొక్క సారాంశంగానే రాజ్యాంగం రూపుదిద్దుకున్నది. అలా రూపుదిద్దుకుని అమలులోకి వచ్చి నేటికి 75 ఏండ్లు నిండుతున్నవి. దాదాపు మూడేండ్లపాటు తీవ్రమైన కృషిచేసి అనేక దేశాల పరిపాలనను, రాజ్యాంగాలను పరిశోధించి ఏర్పాటుచేసుకున్న అతిపెద్ద లిఖిత రాజ్యాంగం మనది. రాజ్యాంగ పరిషత్ అధ్యక్షులుగా డా. బాబూ రాజేంద్ర ప్రసాద్, డ్రాఫ్టింగ్ కమిటీ అధ్యక్షులుగా డాఎం బి.ఆర్.అంబేద్కర్‌లు, మరికొందరు మేధోసంపన్నులు చర్చించి అందించిన మహత్ ప్రణాళిక ఇది. అయితే ఎంతో శ్రమకోర్చి ఇంత పెద్ద రాజ్యాంగాన్ని ప్రజలందరి హక్కులకు, స్వేచ్ఛకు, ప్రజాస్వామిక విధానానికి హామీ ఇస్తూ సమర్పించిన అంబేద్కర్ ఏమన్నారంటే, ఈ రాజ్యాంగం ఘనమైనది, గొప్పదైనదీ అయినప్పటికీ, దీన్ని అమలు చేసే వాళ్లు చెడ్డవారైతే ఎందుకూ పనికిరాదని సెలవిచ్చాడు. ఆ ప్రమాదం 75 ఏండ్ల తర్వాత మరింత పెరిగింది.

రాజ్యాంగ నిర్మాణం కేవలం మేధావుల సృజనాత్మక అంశంగా రూపెత్త లేదు. రాజ్యాలు, సామ్రాజ్యాలు, రాజులు, సామంతులుపోయి బ్రిటీష్‌వారి ఏకచక్రాధిపత్యంలోకి వచ్చాక రెండు వందలేండ్లు సాగిన దోపిడిపై సమైక్యంగా ప్రజల తిరుగుబాటులోంచి స్వాతంత్ర్య పోరాటం నడిచింది. జాతి, మత, కుల, ప్రాంత భేదాల నొదిలి వీరోచిత త్యాగాల ఫలంగా స్వాతంత్ర్యం సిద్ధించింది. ఆనాడు ప్రజలలో ఏర్పడిన ఐక్యత, సమానత, సౌభ్రాతృత్వాల కారణంగా వారి ఆశలు, ఆకాంక్షలు, ఆలోచనల ప్రతిబింబమే మన గణతంత్రం. మరి ప్రజల ఆకాంక్షలు ఏ మేరకు నెరవేరాయి! ఏ దిశగా మన పయనం సాగుతున్నది చర్చించుకోవాల్సిన సందర్భం ఇది. ఈ రాజ్యాంగం ఏర్పడిననాడే, ఈ రాజ్యాంగాన్ని మేము అంగీకరించమని, వ్యతిరేకిస్తూ మాట్లాడినవారు, ఇదే రాజ్యాంగం ప్రకారం ఎన్నికయి ఏలుబడిలో ఉన్నారు. వారి వారసులే మొన్నీమధ్య ఆగస్టు 15ను నిజమైన స్వాతంత్ర్య దినం కాదని, అయోధ్యలో రాముని ప్రతిష్ఠాపన రోజే స్వాతంత్ర్యదినోత్సవమని ప్రకటించాడు. మనుధర్మమే రాజ్యాంగ ధర్మమనీ ఆలోచించేవారి చేతిలో రాజ్యాంగం అమలుకొనసాగటం నేటి విషాదం! 2015లో గణతంత్ర ఉత్సవాలను జరుపుతున్న సందర్భంలో కేంద్ర ప్రభుత్వం ముద్రించిన రాజ్యాంగ ప్రతుల పీఠికలో 'సామ్యవాద', 'లౌకిక' పదాలను తొలగించి అందించారు. అదేమంటే, ఆరంభాన అవిలేవని, మధ్యలో 1976లో 42వ సవరణ ద్వారా చేర్చారని చెప్పారు. కానీ సామ్యవాద, లౌకిక విధానాలతో సాగాలని రాజ్యాంగంలో సారభూతంగా ఆది నుండీ ఉంది. 1973లోనే సుప్రీంకోర్టు ఒక తీర్పులో రాజ్యాంగ స్వరూపాన్ని చెబుతూ లౌకిక ప్రజాస్వామిక, సమానత, స్వేచ్ఛ, సమాఖ్య, సమన్యాయాలతో కూడినదని తెలిపారు. సమన్యాయం సాధించబడలేదు, సామాజిక న్యాయమూలేదు, ఆర్థిక అసమానత పెరిగిపోతున్నది. ఇప్పటికీ ఒక్క శాతం ప్రజల దగ్గర 23శాతం దేశ సంపద ఉంది. 10శాతం ప్రజల దగ్గర 55 శాతం సంపద పోగుబడి ఉందని ప్రభుత్వ రిపోర్టులే చెబుతున్నాయి. ప్రజలందరూ స్వేచ్ఛగా మాట్లాడే హక్కునూ లాగేస్తున్నారు. అధికారానికి వ్యతిరేకంగా మాట్లాడితే దేశ ద్రోహులుగా చిత్రిస్తున్నారు. తినే తిండి, కట్టుకునేబట్ట, పెళ్లి, ఉత్సవం ఏదీ కూడా పౌరులు స్వేచ్ఛగా ఆచరించే వీలు లేకుండా పోయింది. ఇక లౌకికత్వం అనే మాట హేళన చేయబడుతున్నది. మెజారిటీ మతానికి మైనారిటీ మతాల ప్రజలు లోబడి ఉండాలని, లేదంటే చంపుతామని, తరుముతామని బహిరంగంగానే బెదిరిస్తున్నారు. ఇక ప్రజాస్వామ్యమూ పలుచనపడిపోయింది. ఒక ఓటుకు ఒకే విలువ అన్నప్పటికీ ఒక మనిషికి ఒకే విలువ లేదు. ఓటూ సరుకై కొనుగోలుకు గురవుతున్నది. రాజకీయాలు ధనకీయాలయిపోయాయి. అందుకే కుబేరుల బొజ్జలు నింపుతూ, అన్నం పెట్టే రైతన్నలపై కండ్లెర్రజేస్తూ హింసిస్తున్నారు. న్యాయం కావాలన్న గొంతులపై ఉక్కుపాదం మోపుతున్నారు. నిర్బంధాలతో అణచివేతలు చేస్తున్నారు. ఇక సామ్యవాద సమసమాజ భావన తుడిచివేసారు. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం అంగలేస్తున్నది. రాజ్యాంగం కల్పించిన హక్కులు అథఃపాతాళానికి తొక్కి వేయబడుతున్నాయి. కొత్త నేర చట్టాలతో ప్రాథమిక హక్కులే మృగ్యమవుతున్నాయి.

ఎన్ని సవాళ్లు, ఒడిదొడుకులు ఉన్నా ఇప్పటివరకూ దేశ ప్రజలను ఐక్యంగా నిలిపే ప్రయత్నంలో రాజ్యాంగం నిర్వహించిన పాత్ర ఘనమైనది. అనేక అవాంతరాలనూ అధిగమించింది కూడా. కానీ నేడు మత ప్రాతిపదకన ప్రజలను చీల్చే విధానాలు రాజ్యాంగ స్వభావాన్నే దెబ్బతీస్తున్నాయి. అసలు రాజ్యాంగం మీదనే విశ్వసమూ, అమలు చేయాలన్న నిశ్చయం లేని వారుగా పాలకులు ఉండటం నేడు రాజ్యాంగం ఎదుర్కొంటున్న పెద్ద సవాలు. ప్రజల అప్రమత్తత, చైతన్యం మాత్రమే రాజ్యాంగానికి రక్ష.

# కుబేర వర్గాల గుప్పిట్లో ట్రంప్ పాలన



డోనాల్డ్ ట్రంప్ ప్రారంభోపన్యాసం, అధ్యక్షుడుగా మొదటి రోజున ఆయన జారీ చేసిన అధికార ఉత్తర్వుల పరంపరను బట్టి చూస్తే ఆయన ఏం చేస్తానని చెప్పాడో అదే చేశాడని అర్థమవుతుంది. మరోసారి అమెరికా గొప్ప దేశంగా చేస్తానని చెప్పిన ప్రకారం ట్రంప్ పనామా కాల్వను స్వాధీనం చేసుకుంటామని బెదిరింపుకు దిగాడు. 1977లో పనామా ఒప్పందం ప్రకారం దానిపై అదుపు పనామాకు అప్పగించబడింది. 'గల్ఫ్ ఆఫ్ మెక్సికో'కు 'గల్ఫ్ ఆఫ్ అమెరికా' అని కొత్తగా నామకరణం చేశాడు. ఇటీవలి చరిత్రలో ఏ అమెరికా అధ్యక్షుడూ చేయని విధంగా తమ భూభాగం విస్తరించుకోవడం కోసం మరిన్ని సామ్రాజ్యవాద విస్తరణ చర్యలు చేపడతానని ప్రకటించారు. మెక్సికోతో దక్షిణ సరిహద్దులో ఎమర్జన్సీ ప్రకటించి వలసదార్లు సరిహద్దు దాటి రాకుండా సైన్యాన్ని మొహరించాలని ఆదేశాలిచ్చారు. పుట్టుకతోనే పౌరసత్వ హక్కును రద్దు చేయడంతో సహా మరిన్ని వలస నిరోధక చర్యలు కూడా ప్రకటించారు. ఇవన్నీ కూడా జాతి వ్యతిరేకతను పెంచి పచ్చి మితవాద శక్తులకు ఊతమిచ్చేవే.

మరో రకం అధ్యక్ష ఉత్తర్వుల ప్రకారం పారిస్ వాతావరణ పరిరక్షణ ఒప్పందం నుంచి అమెరికా ఉపసంహరించు కుంటుంది. దేశంలో అంతర్గతంగానూ పర్యావరణ పరిరక్షణ చర్యల వ్యవస్థ విచ్ఛిన్నమవుతుంది. చమురు కంపెనీల లాబీ ఎలాంటి నిబంధనలు లేకుండా విచక్షణా రహితంగా వ్యవహరించడానికి ఈ స్వేచ్ఛ పొందబోతున్నది.

### స్పష్టమైన సంకేతం

ట్రంప్ మలి దఫా అధ్యక్ష పీఠం అధిష్టించడంలో కొట్టొచ్చినట్టు కనిపించిన అంశం సాంకేతిక కుబేరుల, మహా సంపన్నుల బహిరంగ మద్దతు. ఇది ప్రమాణ స్వీకారంలో గ్రాఫిక్స్‌తో సహా గోచరమైంది. ప్రపంచ ధనాఢ్యులలోనే ప్రథముడైన ఎలన్ మస్క్ ఇంకా ఇతర మహా సంపన్నులు పాలనా యంత్రాంగంలో నిర్వహించిన పాత్రను బట్టి చూస్తే ఇది మహా కుబేర రాజ్యం (ప్లూటోక్రసీ)గా కనిపిస్తుంది. ఫెడరల్ ప్రభుత్వ వ్యవస్థను కుదించడం వల్ల సామాజిక భద్రతా సదుపాయాలు, సామాజిక సంక్షేమ వ్యయం దెబ్బతిని పోతాయనే భయాలు అలుముకున్నాయంటే అందుకు స్పష్టమైన ఆధారాలున్నాయి. బడా వ్యాపారవేత్తలకూ కార్పొరేట్ ప్రయోజనాలకు యథేచ్ఛగా అవకాశమిచ్చే పాలనా వ్యవస్థ ఇది.

### సరికొత్త సామ్రాజ్యవాద పోకడ

అంతర్జాతీయ సంబంధాల విషయంలో ట్రంప్ అధ్యక్ష కాలం బహుళ పక్ష వ్యవహారాలను, వాణిజ్య సుంకాలు వాతావరణ మార్పుల రక్షణ చర్యలను విచ్ఛిన్నం చేయడం జరిగినా మౌలికంగా అమెరికా ప్రయోజనాలను కాపాడుకోవడం మాత్రం కొనసాగుతుంది. బైడెన్ ప్రభుత్వం పరిశేష నయా మితవాద విదేశాంగ విధానాన్ని అమలు చేయడంలో అపఖ్యాతి మూటకట్టుకుంది. గాజాలో ఇజ్రాయిల్ మారణ యుద్ధానికి నిధులు సమకూర్చింది. ఉక్రెయిన్‌కు నిరాటంకంగా సైనిక, ఆర్థిక సాయం అందించడం ద్వారా రష్యా ఉక్రెయిన్ ఘర్షణ పూర్తి స్థాయి యుద్ధంగా మార్చడానికి కారణమైంది. చైనాతో సంఘర్షణను పెంచడానికి, ఆసియా పసిఫిక్ ప్రాంతంలో కూటములు కట్టడానికి బైడెన్ ప్రభుత్వం పాల్పడింది. ట్రంప్ ప్రభుత్వం పొందికను బట్టి చూస్తే లాటిన్ అమెరికాలో అది మరింత దూకుడుగా వ్యవహరిస్తుందని అంచనా వేయొచ్చు. క్యూబా, వెనిజులాలలో మరింతగా జోక్యాలు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### మోడీ సర్కారు ఆరాటం

అమెరికాకు ఎగుమతయ్యే భారతీయ సరుకులపై సుంకాల విషయంలోనూ ఆంక్షలతో కూడిన వీసాల విషయంలోనూ ట్రంప్ ఎలాంటి చర్యలు తీసుకుంటాడనేది మోడీ ప్రభుత్వం ఆతృతగా ఎదురుచూస్తున్నది. సరైన పత్రాలు లేని వలసదారులను గనక వెనక్కు పంపేయడమనే తన బెదిరింపును ట్రంప్ అమలు చేసేట్టయితే ఇప్పటికే గుర్తించబడిన, కొంత ప్రక్రియ జరిగిన 20 వేల మంది భారతీయులను వెనక్కు పంపేయవచ్చు.

మరింత ముఖ్యమైన విషయమేమంటే మోడీ ప్రభుత్వం ట్రంప్ విశ్వసనీయమైన మంచి మిత్రుడని ఎలాగోలా నిరూపించడానికి తాపత్రయ పడుతున్నది. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ గత కొద్ది వారాల్లో వాషింగ్టన్‌లో రెండు సార్లు మకాం వేశారు. ప్రమాణ స్వీకారానికి హాజరు కావడం కోసం వెళ్లిన ఆయన క్వాడ్ కూటమికి చెందిన ఇతర విదేశాంగ మంత్రులతో పాటు అమెరికా నూతన విదేశాంగ మంత్రిని కలుసుకున్నారు. కానీ ట్రంప్‌తో ఫోటో తీసుకునే అవకాశం మాత్రం ప్రమాణ స్వీకారానికి ముందు జరిగిన విందు సందర్భంలో ముఖేష్, నీతా అంబానీలకే దక్కింది. ఇప్పుడు వాషింగ్టన్‌లో మంత్రుల కన్నా మహా కుబేరులకే ఆధిక్యత వచ్చింది. మోడీ సర్కారు ట్రంప్ చాంచల్యాలపైన ఆధారపడి అడుగులు తప్పుగా వేయడంగాక మరింత వ్యూహాత్మక స్వాతంత్ర్యం పునరుద్ధరించుకునే విధంగా తీవ్రమైన మందగమనంలో పడిన భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకోవడానికి తగిన విధంగా తన వ్యూహాన్ని పునరుల్లేఖించుకోవాలి.

# పార్ట్‌టైం చేస్తే ఇంటికే!





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**-అమెరికాలో విద్యార్థులకు డిపోర్టేషన్ ముప్పు**
**-చదువు పేరుతో వెళ్లి ఉద్యోగం చేసేవారిపై**
**-నిఘా పెట్టి పట్టుకుంటున్న అధికారులు**
**-పట్టుబడ్డ వారిని స్వదేశానికి పంపుతూ ఆదేశం**
**-వారం రోజులుగా పార్ట్ టైం జాబ్‌లకు డుమ్మా**
**-అక్కడి భారతీయ వ్యాపారులపైనా ప్రభావం**

హైదరాబాద్, (ప్రజా స్వేచ్ఛ)

అమెరికాలోని మిషిగన్ స్టేట్‌లో.. ఓ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న ఇద్దరు విద్యార్థులను ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) అధికారులు 21వ తేదీ రాత్రి పట్టుకున్నారు. ఆ విద్యార్థులు నిబంధనలకు విరుద్ధంగా క్యాంపస్ బయట అనధికారికంగా పనులు చేస్తుండడమే ఇందుకు కారణం. క్యాంపస్ నుంచి వారు ఎక్కడికి వెళు_న్నారు? ఏం చేస్తున్నారన్న దానిపై మూడు రోజులపాటు నిఘా పెట్టి మరీ పట్టుకున్నారు. అనంతరం వారి సెవిస్ (విద్యార్థికి అమెరికాలో ఇచ్చే గుర్తింపు సంఖ్య)ను రద్దు చేశారు. ఆపై ఫిబ్రవరి 15లోగా దేశం విడిచి వెళ్లాలని ఆదేశించారు. దీంతో ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి.. ఖర్చుల కోసం పార్ట్ టైం జాబ్ చేస్తున్న ఈ విద్యార్థుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. మిషిగన్‌లో మాత్రమే కాకుండా అమెరికా వ్యాప్తంగా ఇవే పరిస్థితులు నెలకొన్నాయి. అక్కడ పార్ట్ టైం ఉద్యోగాలు చేసే విద్యార్థులందరిలోనూ ఆందోళన మొదలైంది. అంతేకాదు.. వీరితో పని చేయించుకుంటున్న భారత్‌కు చెందిన వ్యాపారవేత్తల పరిస్థితి కూడా ఇబ్బందికరంగా మారింది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ తిరిగి ఎన్నికయ్యాక తీసుకుంటున్న నిర్ణయాలే ఇందుకు కారణం. ట్రంప్ బాధ్యతలు చేపట్టగానే అక్రమ వలసదారులపై కఠినంగా వ్యవ హరించాలని నిర్ణయించారు. ఇది.. అమెరికాలో అధిక సంఖ్యలో ఉన్న భారతీయుల్లో, తెలుగు రాష్ట్రాలకు చెందిన వారిలో గుబులు రేపుతోంది. ముఖ్యంగా ఉన్నత చదువుల కోసం ఎఫ్-1 వీసాపై అక్కడ ఉంటూ నిబంధనలకు విరుద్ధంగా పార్ట్ టైం ఉద్యోగాలు చేసుకుంటున్నవారు, మాస్టర్స్ పూర్తయి ఓపీటీ సమయంలో ఉన్నవారి పరిస్థితి ఎటూ తోచకుండా ఉంది.

**ఎఫ్-1 వీసాదారుల్లో గుబులు..**

ఉన్నత చదువుల కోసం తమ దేశానికి వచ్చేవారికి అమెరికా ప్రతి ఏటా దాదాపు 2లక్షల ఎఫ్-1 వీసాలు జారీ చేస్తుంది. ఇందులో దాదాపు 40 శాతం భారతీయులకే కేటాయిస్తోంది. 2024లోనూ అమెరికా దాదాపు 84 వేల మంది భారతీయులకు ఎఫ్-1 వీసాలు జారీ చేసింది. ఇందులో తెలుగు రాష్ట్రాలకు చెందినవారి సంఖ్య దాదాపు 25 వేల వరకు ఉంటుంది. ఇలా ప్రతి ఏటా ఇక్కడి నుంచి 25-30 వేల మంది తెలుగువారు ఉన్నత చదువుల పేరుతో అగ్రరాజ్యానికి వెళ్తున్నారు. అయితే చాలా మంది విద్యార్థులు ఫుల్ టైం చదువుల పేరుతో వీసాలు దక్కించుకుని.. విద్యను పక్కనబెట్టి అక్కడ పార్ట్ టైం ఉద్యోగాలు చేస్తున్నారు. ఇలా ఎఫ్-1 వీసాపై వచ్చి పార్ట్ టైం ఉద్యోగం చేయడం కూడా అమెరికా చట్టాల ప్రకారం నేరమే. దీంతో తాజాగా ఇలాంటి ఉద్యోగాలపై అక్కడి అధికారులు దృష్టి సారించారు. వీరిని గుర్తించేందుకు అధికారులు తనిఖీలు నిర్వహిస్తారన్న వార్తలతో పార్ట్‌టైం, ఫుల్ టైం ఉద్యోగాలు చేస్తున్న ఎఫ్-1 వీసాదారుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. అక్కడి రెస్టారెంట్లు, సూపర్ మార్కెట్లు, పెట్రోల్ బంకుల్లో పనిచేసే వారంతా గత వారం రోజులుగా విధులకు డుమ్మా కొడుతున్నారు.

**ఉద్యోగం చేస్తూ పట్టుబడితే ఇంటికే..**

ఉన్నత చదువు కోసం అమెరికా వెళ్లిన ప్రతి ఒక్కరూ అక్కడ ఏదో ఒక ఉద్యోగం చేయడం సాధారణంగా మారింది. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు పార్ట్ టైం, ఫుల్ టైం ఉద్యోగాలు చేస్తూ తనిఖీల్లో పట్టుబడితే తమ చదువును మధ్యలోనే ఆపేసి స్వదేశానికి వెళ్లిపోవాల్సి ఉంటుంది. ఇలాంటి వారికి ఇక భవిష్యత్తులోనూ అమెరికా వచ్చే అవకాశాలు సన్నగిల్లుతాయి. దీంతో ఈ భయం ఎఫ్-1 వీసాదారుల్లో ఎక్కువగా నెలకొంది. అలాగే అమెరికాలో ఉన్నత చదువులు పూర్తయ్యాక.. ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ)కు అవకాశం ఇస్తారు. ఇది కోర్సులను బట్టి 12-36 నెలల వరకు ఉంటుంది. ఆ తర్వాత అక్కడ ఉద్యోగాలు చేసేందుకు హెచ్-1బీకి అర్హత లభిస్తుంది. ఓపీటీ గడువు పూర్తయ్యాక ఐ-140 వీసా జారీ చేస్తారు. ఇది వస్తే గ్రీన్ కార్డ్ వచ్చేందుకు మార్గం సుగమం అవుతుంది. ఇలా.. ఓపీటీలో అక్కడ తెలుగు రాష్ట్రాలకు చెందినవారు దాదాపు 2లక్షల మందికిపైగా ఉంటారని అంచనా. కానీ, ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో గ్రీన్ కార్డ్ రావడం అసాధ్యంగా కనిపిస్తోంది. దీనికోసమే అక్కడ ఓపీటీ చేస్తున్న వేలాది మంది విద్యార్థుల్లో తాజా పరిణామాలు నిరాశకు గురి చేస్తున్నాయి.

**భారతీయ వ్యాపారులపైనా ప్రభావం..**

ట్రంప్ సర్కారు నిర్ణయం.. ఇటు విద్యార్థులతోపాటు అక్కడ వ్యాపారాలు చేసుకుంటున్న భారతీయుల పైనా తీవ్ర ప్రభావం చూపనుంది. ఇక్కడి నుంచి వెళ్లే విద్యార్థులు తమ ఖర్చుల కోసం ఏదో ఒక పనిని తక్కువ వేతనానికే చేసేందుకు సిద్ధంగా ఉంటారు. పైగా ఎన్ని గంటలైనా అభ్యంతరం చెప్పకుండా పనిచేస్తారు. దీంతో అక్కడ వ్యాపారం చేసుకునే భారతీయులు ఎక్కువగా వీరినే తమ పనిలో పెట్టుకుంటుంటారు. కానీ, పని చేస్తూ పట్టుబడితే మొదటికే మోసం జరిగే ప్రమాదం నెలకొనడంతో వ్యాపారులు కూడా ఆ విద్యార్థులను పనిలోకి పిలవడంలేదు. ఫలితంగా అమెరికాలో భారతీయ వ్యాపారాలు కూడా దెబ్బతినవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ఇప్పుడు అమెరికా-ఇండియా ఒక్కటే**

# తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం మరో భారీ పెట్టుబడి

ప్రజా స్వేచ్ఛ.....



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

దావోస్ వేదికగా జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం మరో భారీ పెట్టుబడి ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ప్రఖ్యాత కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ లిమిటెడ్ (CtrlS Datacenters Pvt Ltd) సంస్థ రూ.10వేల కోట్ల పెట్టుబడితో రాష్ట్రంలో అత్యాధునిక AI డేటాసెంటర్ క్లస్టర్‌ను నెలకొల్పేందుకు ముందుకొచ్చింది. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పరిశ్రమలు,ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారి సమక్షంలో ఉన్నతాధికారులు, కంట్రోల్‌ఎస్ (CtrlS) సీఈవో శ్రీదర్ పిన్నపురెడ్డి రెడ్డి గారు ఒప్పందాలపై సంతకాలు చేశారు. కంట్రోల్‌ఎస్ (CtrlS) తలపెట్టిన అర్టిఫిషియల్ డేటా సెంటర్ క్లస్టర్ సామర్థ్యం 400 మెగా వాట్లు కాగా, ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 3,600 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయి. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు గారు మాట్లాడుతూ రాష్ట్రంలో డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఈ డేటా సెంటర్ ఏర్పాటు మరో మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. ఐటీ సేవల సామర్థ్యం పెరుగుఉందని, ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని చెప్పారు.తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యం పంచుకోవటం గర్వంగా ఉందని, డేటా సెంటర్ల ఏర్పాటుతో తెలంగాణలో ఐటీ సేవల ప్రమాణాలు మరింత వృద్ధి సాధిస్తాయని కంట్రోల్ ఎస్ (CtrlS) సీఈవో శ్రీధర్ పిన్నపురెడ్డి గారు అన్నారు.

# రేపు నాలుగు కొత్త పథకాలను ప్రారంభించనున్న రేవంత్ సర్కారు!

హైదరాబాద్:ప్రజా స్వేచ్ఛ



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

తెలంగాణ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా, కాంగ్రెస్ ప్రభుత్వం జనవరి 26న నాలుగు కొత్త సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టనుంది.తెలంగాణ రైతాంగం, ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పథకాలు ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాలను రేపు అధి కారికంగా ప్రారంభించను న్నారు.ఈ నేపథ్యంలో, హైదరా బాద్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్య మంత్రి శనివారం మంత్రు లు, ఉన్నతాధికారులతో సమావేశమై సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రేషన్ కార్డులపై కీలక విషయాన్ని వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రేపు నాలుగు సంక్షేమ పథకాలు మండలంలోని ఒక గ్రామంలో మధ్యాహ్నం 1 గంటలకు లాంఛనంగా ప్రారంభిస్తామని, రేషన్ కార్డులు, ఇండ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా ఇస్తామని ఆయన పేర్కొన్నారు.అంతేకాకుండా.. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని ఆయన ప్రకటించారు. గతంలో దరఖాస్తు ఇచ్చినా, సర్వేలో వివరాలు ఇచ్చినా ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోక పోయినా ఇప్పుడు ప్రజాపాలన కేంద్రాల్లో ఇవ్వండని ఆయన తెలిపారు. బీపీఎల్ కుటుంబాలందరికి రేషన్ కార్డులు ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించిందని ఆయన వెల్లడించారు. గత పదేళ్ళుగా దొడ్డు బియ్యం ఇచ్చారని, మనిషికి ఆరు కిలోల సన్న బియ్యం రేషన్ కార్డు ద్వారా అందిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇకపై బయట ఆహార పదార్థాలు కొనుక్కో వాల్సి ఉండదన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్.

# ఖైదీల ప్రవర్తనలో మార్పు రావాలి

**-జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. బి నిర్మలా గీతాంబా**

నర్సంపేట,ప్రజా స్వేచ్ఛ




క్షణికావేశంలో తెలిసి తెలియక తప్పులు చేసి శిక్ష అనుభవిస్తున్న ఖైదీల ప్రవర్తనలో మార్పు రావాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీ.బీ నిర్మలా గీతాంబా సూచించారు. నర్సంపేట పట్టణంలోని ప్రత్యేక మహిళ కారాగారంలో ఖైదీల హక్కులు అంశంపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం జిల్లా న్యాయ సేవాధికార కార్యదర్శి సాయికుమార్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ వి బి నిర్మల గీతాంబా హాజరై మాట్లాడారు. క్షణికావేశంలో తెలిసి తెలియక చేసిన తప్పులకు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు కారాగారంలో తమ తప్పులను గుర్తించి తిరిగి పునరావృతం చేయకుండా చూసుకోవాలని సూచించారు. ఇప్పటికైనా తమ ప్రవర్తనలో మార్పు రావాలని శిక్షాకాలం పూర్తయ్యాక సమాజంలో మంచి పేరు తెచ్చుకునేలా మారాలని సూచించారు. ఖైదీలకు వారి హక్కులను వివరించారు. ఆర్థిక స్తోమత లేని వారికి ఉచిత న్యాయవాదిని తామే సమకూర్చి న్యాయం జరిగేలా సహకరిస్తామని తెలిపారు. బెయిల్ వచ్చే నేరాల క్రింద అరెస్టు అయిన వారు సూరిటీలను సమకూర్చుకొని వేలు పొందవచ్చునని తెలిపారు. విచారణలో ఉన్న ప్రతి ఖైదీకి తమ కేసులను సత్వరం న్యాయంగా విచారణ చేసి పరిష్కరించాలని కోరే ప్రాథమిక హక్కు వారికి ఉందని తెలిపారు. ఖైదీలకు సమస్యలను చెప్పుకునే హక్కు దానికి సరియైన పరిష్కారాన్ని పొందే హక్కులు ఉంటాయని తెలిపారు. ఎటువంటి సమస్యలకైనా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలని అందుకే ప్రతి నెల ఖైదీల హక్కులకు భంగం కలగకుండా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ని సందర్శింప చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరిండెంట్ కే ఎన్ ఎస్ లక్ష్మీ శ్రుతి, నర్సంపేట న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పుట్టపాక రవి, ఏజిపి సంజయ్ కుమార్, జైలు విసిట్ అడ్వకేట్ సునీతతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి

**-బి జె పి మండల పార్టీ అధ్యక్షులు కిరణ్**

మద్దిరాల,ప్రజా స్వేచ్ఛ



మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక తహసిల్దార్ ను మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించినటువంటి ఆరు గ్యారెంటీలు గురించి మండలంలో ఉన్నటువంటి గ్రామాలలో అర్హులైన నిరుపేదలందరికీ అవకాశం కల్పించాలని రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లుల ను అధికార పార్టీ నాయకుల ప్రమేయం లేకుండా అధికారులే స్వయంగా సర్వే చేయించుకుని గ్రామాలలో నిరుపేదలకు అందించి న్యాయం చేయాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది.కార్యక్రమంలో మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు వడ్డానం కిరణ్ బిజెపి ఎస్సీ సెల్ రాష్ట్ర మోర్చా అధికార ప్రతినిధి వంగూరి రమేష్ గ్రామ శాఖ అధ్యక్షులు వల్లపు అశోక్ వెలుగు రమేష్ కోడి వెంకటేశ్వర్లు పెద్దూరు తులసి జలగం ఉపేందర్ నితిన్ రెడ్డి రామ్మూర్తి వెంకటేశ్వర్లు లింగరాజు విక్రమ్ లింగయ్య మహేష్ తదితరులు పాల్గొన్నారు

## సంగమేశ్వర లాడ్జిలో మహిళా హత్య

# కేసును చేదించిన షాద్ నగర్ పోలీసులు

-హత్య చేసింది రౌడీ షీటర్ అంద్రి దేవదాసు



**రంగారెడ్డి జిల్లా,ప్రజా స్వేచ్ఛ**

సంగమేశ్వర లాడ్జిలో ఓ మహిళను దారుణంగా హత్య చేసిన నిందితున్ని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. మహిళ హత్య కేసు మిస్టరీని ఛేదించారు. షాద్ నగర్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసిపి) రంగస్వామి శనివారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పట్టణ సీఐ విజయ్ కుమార్ ఎస్సైలు సుశీల, బలరాం తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం పిట్టలగూడ గ్రామానికి చెందిన మహిళా కూలి నీలవేణి (35) చేగురులోని ప్రముఖ ఆశ్రమం కన్హా శాంతివనంలో స్వీపర్ గా పనులు చేస్తుంది. అదే ఆశ్రమంలో ప్రైవేట్ వార్డెన్ గా ఇంటర్ కాలేజీలో పనిచేస్తున్న కర్నూలు జిల్లా బండమీది అగ్రహారం గ్రామం గోనెగండ్ల మండలానికి చెందిన దేవదాసు మృతురాలితో సహా జీవనం చేస్తున్నాడు. నిందితుడు బిఏ డిగ్రీ, డిప్లొమా ఈసీఈ చదివి 2012లో ఇంద్ర సుహాసినితో పెళ్లి చేసుకున్నాడు. అతనికి ఇద్దరు కూతుళ్లు సంసార విషయంలో మనస్పర్ధలు వచ్చి దేవదాసును భార్య విడిచిపెట్టి పుట్టింటికి వెళ్ళిపోయింది. ఆ తర్వాత కాంటాక్ట్ బేసిక్ పై జూనియర్ లైన్మెన్ గా ఆంధ్రప్రదేశ్ లో పనిచేశాడు. ముద్దాయి నేరచరిత్రను పరిశీలిస్తే క్రైమ్ నెంబర్ 184/2021 ప్రకారం బైలుప్పల గ్రామానికి చెందిన లక్ష్మీ అనే మహిళతో పరిచయం చేసుకొని సహజీవనం చేశాడు. కొన్ని రోజుల తర్వాత ఆమె వేరే అతనితో మాట్లాడుతుందని అనుమానం వచ్చి తన మోటార్ సైకిల్ పై లక్ష్మీని తీసుకువెళ్లి ఆమె గొంతు నిలిపి హత్య చేశాడు. ఆమె శవాన్ని పెట్రోల్ పోసి తగలబెట్టాడని ఎసిపి రంగస్వామి వివరించారు. అదేవిధంగా క్రైమ్ నెంబర్ 05/2024 మరో కేసులో కర్నూలు జిల్లా కేంద్రంలో 2023 డిసెంబర్ నెలలో సిల్వర్ జూబ్లీ కాలేజీ దగ్గర ఒక టిఫిన్ సెంటర్లో ఉండే మరో మహిళ లక్ష్మీతో పరిచయం చేసుకొని ఆమెతో శారీరక సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం ఆమె భర్త రమేష్ కు తెలిసి వారిని కలవనీయకపోవడంతో 2024 లో ఆమె భర్త అడ్డు తొలగించాలని వాళ్ళ ఇంటికి వెళ్లి భర్త రమేష్ పై కత్తితో దాడి చేసి హత్య ప్రయత్నం చేశాడు. ఈ కేసులు త్రీటౌన్ కర్నూల్ పోలీస్ స్టేషన్లో రౌడీషీటర్ పోలీసులు ఓపెన్ చేశారని ఎసిపి తెలిపారు. దేవదాసుపై నిఘా ఎక్కువైందని అక్కడి నుండి మకాం మార్చి రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలోని నందిగామకు వచ్చాడు. కన్హా శాంతి వనంలోని కెసిసి కాలేజ్ లో వార్డెన్ గా పనిచేస్తూ హౌస్కీపింగ్ చేస్తున్న మృతురాలు పిట్టల శివనీలతో పరిచయం పెంచుకున్నాడు. భర్త లేని శివనీల నిందితుడిని మాటలు నమ్మి మోసపోయి అతనితో శారీరక సంబంధం ఏర్పరచుకుంది. పెళ్లి చేసుకుంటానని ఆమెను నమ్మించి మోసం చేశాడు. జనవరి 20 వ తేదీన ఉదయం 9 గంటలకు షాద్ నగర్ కు పిలిచి స్థానిక శ్రీ సంగమేశ్వర లాడ్జికి 202 రూము బుక్ చేసుకొని ఆమెను అదే రోజు తన అడ్డును తొలగించుకునేందుకు చీర కొంగుతో ముడివేసి ఊపిరి ఆడకుండా చంపేశాడని ఏసీపీ తెలిపారు. ఆమె శరీరం పై గల బంగారు వెండి వస్తువులను దొంగిలించి బైక్ పై పారిపోయాడు.వీటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసు దర్యాప్తును కమిషనర్ ఆఫ్ పోలీస్ అవినాష్ మహంతి ఆదేశాలతో శంషాబాద్ డిసిపి రాజేష్, అడిషనల్ డీసీపీ రామ్ కుమార్, స్థానిక ఏసిపి రంగస్వామి పర్యవేక్షణలో పట్టణ సీఐ విజయ్ కుమార్, ఎస్సైలు బలరాం సిబ్బంది జాకీర్ కరుణాకర్, నరేందర్, రాజేష్, సాయి చంద్ర, రఫీ, రాఘవేందర్ సహకారంతో నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్నట్లు తెలిపారు. సిబ్బందికి తగిన రివార్డులను అధికారుల ద్వారా ఇప్పించడం జరుగుతుందని ఏసీబీ రంగస్వామి మీడియాకు తెలిపారు.

# కుమ్మర కుల నాయకులారా?



-కోదూరి చంద్రయ్య



-కుమ్మరి హక్కుల పోరాట పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి

**ప్రజా స్వేచ్ఛ......**

రాష్ట్ర స్థాయి కుమ్మర సంఘాల నాయకులు సరిగా పనిచేయక మనము ప్రభుత్వాల ద్వారా ఎలాంటి లబ్ధి పొందలేకపోయాము సరే అది జరిగిపోయినది. మనము బిసి కులాలలో మనది ఒక కులము రిజర్వేషన్లు అనేటివి బిసి కులాలన్నిటికీ అమలు కాక మనము రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా వెనుకబడిపోయినాము. ఇప్పుడు బీసీ ఉద్యమము రాష్ట్రంలో బ్రహ్మాండంగా జరుగుతున్నది. ఈ ఉద్యమాన్ని మనము ఉపయోగించుకోవాలి. ఈ ఉద్యమంలో మనము ముందు వరుసలో నిలబడి పోరాడాలి. కావున మన కుమ్మరి కులం తరపున . .బీసీ సభలకు భారీగా హాజరు కావాలి.ప్రతి కుమ్మర కులస్తుడు తన కుల బలాన్ని ప్రదర్శించడానికి" మట్టి రంగులో కండువాలు"వేసుకొని హాజరు కావాలి. ఆ రంగు మీకు తెలిసినదే !ఆ రంగును మేటర్ను కూడాఈ క్రింద పంపిస్తాను.ఈ మట్టి రంగు కండువాలు కప్పుకున్న వాళ్లంతా ఒకవైపు ఉంటే ! కుమ్మర కులస్తులు ఇంతమంది వచ్చింద్రు అనేది బీసీ నాయకుల దృష్టికి వెళుతుంది. మన ఐక్యతను చాటటానికి మనము బీసీ సభల్లో పాల్గొన్న సంఖ్యను చూపటానికి ఉపయోగపడుతుంది. కావున ఫిబ్రవరి 2వ తేదీన వరంగల్లో జరిగే యుద్ధభేరి బిసి బహిరంగ సభకు పరిసర మండలాల అసెంబ్లీ నియోజకవర్గాల గ్రామాల కుమ్మర కులస్తులు అందరూ హాజరు కాగలరు ప్రతి కుమ్మర భుజంపై మట్టి రంగు కండువా ఉండాలి.రెండు మీటర్ల బట్ట తీసుకుంటే అందులో ఎనిమిది కండువాలు చింపి వాడుకోవచ్చు !20 రూపాయలకు మీటర్ చొప్పున మాత్రమే దుకాణాలలో తక్కువ ధరకు దొరుకుతవి. 40 రూపాయలకు రెండు మీటర్ల బట్ట తీసుకుంటే ! ఎనిమిది కండువాలు తయారు అవుతాయి.ఐదు రూపాయలకు ఒక కండువా తయారవుతుంది మీరు ఈ కండువాలు తప్పనిసరిగా మెడ మీద వేసుకొని వచ్చి ఈ భారీ బహిరంగ సభల్లో పాల్గొనగలరు. మన కుమ్మర కుల ఐక్యతను ప్రదర్శించగలరు.బీసీ ఉద్యమమన్నది బిసి గ్రూపులో గల అన్ని కులాలకు సంబంధించిన.అందులో మన కుమ్మర కులము కూడా ఇమిడి ఉన్నది మన కుమ్మరి కులంలో విద్యావంతులు తెలివిగలవారు పదవుల్లో ఉన్నవారు ఉన్నారు ఉద్యోగస్తులు ఉన్నారు ఈ బీసీ ఉద్యమాన్ని ముందటికి తీసుకుపోవడానికి మన కుమ్మర కులం నుండి కూడా మనము ముందు వరుసలో ఉండాలి బీసీ ఉద్యమ చరిత్ర పుస్తకాలలో మన కుమ్మర కులస్తులకు కూడా ఒక పేజీ కేటాయించబడాలి. కాబట్టి బీసీ ఉద్యమం సందర్భంగా చేపట్టే కార్యక్రమాల్లో మీరందరూ పాల్గొనగలరు రేపు ఫిబ్రవరి 2 వ తేదీన జరగనున్న బీ సీ యుద్ధభేరి భారీ బహిరంగ సభను విజయవంతం చేయటానికి మన కుమ్మరి కులం తరపున ఈ కార్యక్రమాల్లో పాల్గొనగలరుజై కుమ్మర !కోదూరి చంద్రయ్య కుమ్మర

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ

-అనంతగిరి నేటి భారత్ ప్రజా ప్రతినిధి

-ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి



**అనంతగిరి,ప్రజా స్వేచ్ఛ**

మండల పరిధిలోని అమీనాబాద్ గ్రామానికి చెందిన బోడపూడి లక్ష్మీనారాయణ, చిలకమూడి మల్లేశ్వరరావు లకు శనివారం కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.పార్టీలకు అతీతంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నారన్నారు.రాష్ట్రంలోని పేద ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పాటుపడుతుందని అన్నారు.లక్షలు ఖర్చు చేసి కార్పొరేట్ వైద్యశాలల్లో చికిత్స చేయించుకోలేని వారికి సీఎంఆర్ఎఫ్ పథకం కొండంత అండగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు బుర్ర పుల్లారెడ్డి,గోపాల్ రెడ్డి,ముత్తినేని కోటేశ్వరరావు,మాజీ ఎంపీపీ చుండూరి వెంకటేశ్వరరావు,గుర్రం వెంకట్ రెడ్డి,బోడపూడి సత్యనారాయణ గీత లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లా పాలిటెక్నిక్ జిల్లాస్థాయి క్రీడల్లో అనురాగ్ కాలేజీ విద్యార్థుల ప్రభంజనం




**అనంతగిరి-ప్రజా స్వేచ్ఛ**

ఉమ్మడి నల్గొండ జిల్లా పాలిటెక్నిక్ క్రీడల్లో అనురాగ్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు.ఈనెల 23న నందికొండ లో జరిగిన ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి పాలిటెక్నిక్ క్రీడల్లో అనురాగ్ విద్యార్థులు ప్రథమ ధృతీయ స్థానాల్లో విజయాలను సాధించి రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ టి. సురేష్ కుమార్,జె. శ్రీనివాసరావు తెలిపారు. వాలీబాల్ డబల్ టెన్నిస్ సింగిల్ టెన్నిస్ షటిల్ బ్యాట్మెంటన్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించగా షటిల్ సింగిల్స్ లో ద్వితీయ బహుమతి గెలుపొందారని,అదేవిధంగా లాంగ్ జంప్,హై జంప్,త్రిఫల్ జంప్,త్రోస్ షార్ట్ పుట్ జావెలిన్ లలో ప్రథమ స్థానం,100 మీటర్లు,200 మీటర్లు,400 మీటర్లు,800 మీటర్ల పరుగు పందాల్లో ప్రథమ బహుమతి గెలుపొందారని అన్నారు. విజేతలుగా నిలిచిన అనురాగ్ విద్యార్థులు ఫిబ్రవరి 3, 4న నిర్వహించే రాష్ట్ర స్థాయి క్రీడల్లో అర్హత సాధించారని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారి గెలుపు కారణమైన ఫిజికల్ డైరెక్టర్ శ్రీను ధర్మబిక్షాలను కళాశాల వివిధ విభాగాల ప్రధానోపాధ్యాయుల

## ఉమ్మడి మెదక్ జిల్లా ప్రథమ చైర్మన్ వర్ధంతి సందర్భంగా జెండా ఆవిష్కరణ.



**ప్రజా స్వేచ్ఛ**

మెదక్ జిల్లా హవేలి ఘనపూర్ మండలం ముత్తాయి పల్లి గ్రామానికి చెందిన రెడ్డి గారి నరసింహారెడ్డి 63 వ వర్ధంతి సందర్భంగా మెదక్ పట్టణంలోని గాంధీ నగర్ లో ఆయన సమాధి వద్ద రెడ్డి గారి నరసింహారెడ్డి, వారి బంధువులు జెండా ఆవిష్కరణ ఉందని ఈ సందర్భంగా తెలిపారు. అతని మనుమడు అయిన నరసింహారెడ్డి మాట్లాడుతూ మెదక్ ఉమ్మడి జిల్లా ప్రథమ జిల్లా పరిషత్తు చైర్మన్ గా పని చేశారని. అలాగే గజ్వేల్ శాసన సభ్యుడిగా గెలుపొందారని.. 1962 జనవరి 26వ తేదీన జెడ్పి చైర్మన్ గా ఉన్న సమయంలో సంగారెడ్డి లో జెండా ఎగురవేయడానికి వెళ్తున్న క్రమంలో మార్గమధ్యంలో జీపు ఢీకొని ప్రమాదవశాత్తు మరణించాడనీ అన్నారు. ఆయన మరణించిన రోజు గణతంత్ర దినోత్సవం కావడంతో అదే రోజు వర్ధంతి సందర్భంగా జెండా ఆవిష్కరణ చేయడం జరుగుతుందని తెలిపారు. ఆయన మరణం అనంతర రెడ్డి గారి నరసింహారెడ్డి సతీమణి రత్నమ్మ రామాయంపేట శాసనసభ్యురాలుగా 2 పర్యాలయాలు గెలుపొంది సేవలందించారని ఈ సందర్భంగా తెలియజేశారు. రెడ్డి గారి నరసింహారెడ్డి ముత్తాయి పల్లి గ్రామంలో పుట్టడంతో ఆ గ్రామానికి ఉమ్మడి మెదక్ జిల్లా మొదటి జడ్పీ చైర్మన్ కొనసాగడంతో ఆ గ్రామానికి గుర్తింపు వచ్చిందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు.

# బిజినెస్

## రిపబ్లిక్ డే డిస్కౌంట్.. రిలయన్స్ డిజిటల్‌లో రూ.67,499లకే మోటరోలా రేజర్ 50 ఆల్ట్రా..!



గతేడాది మోటరోలా తన మోటరోలా రేజర్ 50 ఆల్ట్రా ఫోన్‌ను గతేడాది భారత్ మార్కెట్‌లో ఆవిష్కరించింది. రిపబ్లిక్ డే సెలబ్రేషన్స్ నేపథ్యంలో విక్రయాలను ప్రోత్సహించడానికి వీలుగా ఈ మోటరోలా ఫోల్డబుల్ స్మార్ట్ ఫోన్ ధరపై భారీ డిస్కౌంట్ అందిస్తోంది. 12జీబీ ర్యామ్‌తోపాటు క్వాల్ కామ్ స్నాప్ డ్రాగన్ 8ఎస్ జెన్3 ప్రాసెసర్‌తో వస్తున్న మోటరోలా రేజర్ 50 ఆల్ట్రా లాంచింగ్ ధర రూ.99,999. కాగా, ఇప్పుడు రూ.79,999లకే సొంతం చేసుకోవచ్చు.50-మెగా పిక్సెల్ డ్యుయల్ ఔటర్ కెమెరా, 32- మెగా పిక్సెల్ ఇన్నర్ కెమెరా సెటప్‌తో వస్తున్న మోటరోలా రేజర్ 50 ఆల్ట్రా ఫోన్‌ను రిలయన్స్ డిజిటల్ స్టోర్లలో కొనుగోలు చేస్తే రూ.10 వేల డిస్కౌంట్ అందిస్తోంది. రిలయన్స్ డిజిటల్ ఇండియా సేల్ ఈ నెల 26తో ముగుస్తుంది. దీంతోపాటు రూ.6,999 విలువ గల మోటో బడ్స్ ం కూడా అందిస్తోంది. ఈ ఫోన్ మిడ్ నైట్ బ్లూ, స్ప్రింగ్ గ్రీన్, పీచ్ ఫజ్ కలర్ ఆప్షన్లలో లభిస్తుంది. ఐసీఐసీఐ బ్యాంకు, కోటక్ మహీంద్రా బ్యాంక్, బీవోబీ కార్డ్, ఫెడరల్ బ్యాంకు కార్డులపై రూ.2,500 వరకూ డిస్కౌంట్‌తో మోటరోలా రేజర్ 50 ఆల్ట్రా ఫోన్ రూ.67,499లకు సొంతం చేసుకోవచ్చు మోటరోలా రేజర్ 50 ఆల్ట్రా ఫోన్ గతేడాది జూలైలో ఆవిష్కరించారు. క్వాల్‌కామ్ స్నాప్ డ్రాగన్ 8ఎస్ జెన్ 3 ప్రాసెసర్ కలిగి ఉంటుంది. 12 జీబీ ర్యామ్ విత్ 512 జీబీ స్టోరేజీ వేరియంట్‌గా అందుబాటులో ఉంది. ఈ ఫోన్ 6.9 అంగుళాల ఫుల్ హెచ్‌డీం (1080ఐ2640 పిక్సెల్స్) ఎల్‌టీపీఓ పోలెడ్ ఇన్నర్ డిస్‌ప్లే విత్ 165 హెర్ట్జ్ రీఫ్రెష్ రేటు, 4- అంగుళాల కవర్ డిస్‌ప్లే (1080ఐ1272 పిక్సెల్స్) ఎల్‌టీపీఓ పోలెడ్ ప్యానెల్ విత్ 165 హెర్ట్జ్ రీఫ్రెష్ రేట్ కలిగి ఉంటుంది.

## ఇండిగో ప్రాఫిట్ డౌన్



దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.2,450 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.2,986 కోట్ల లాభంతో పోలిస్తే 18 శాతం తగ్గింది. కంపెనీ ఆదాయం రూ.20,062 కోట్ల నుంచి రూ.22,992 కోట్లకు ఎగబాకినట్లు వెల్లడించింది.

## సుజుకి ఫౌండర్ సుజుకి సహా ఏడుగురికి పద్మ పురస్కారాలు..!



భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం శనివారం పద్మ పురస్కారాలు ప్రకటించింది. వాటిలో ఎనిమిది మంది పారిశ్రామిక వేత్తలు, బ్యాంకింగ్ నిపుణులకు పద్మ పురస్కారాలు అందిస్తామని తెలిపింది. జపాన్‌కు చెందిన ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ సుజుకి వ్యవస్థాపకులు ఒసాము సుజుకి (మరణానంతరం)కి పద్మ విభూషణ్ పురస్కారాన్ని కేంద్రం ప్రకటించింది.

## యూజ్డ్ కార్లలో మారుతి స్విఫ్ట్‌దే హవా..!



కరోనా మహమ్మారి తర్వాత అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ పర్సనల్ మొబిలిటీ వైపు మొగ్గు చూపుతున్నారు. వెసులుబాటు ఉన్నవారు కొత్త కార్లు కొనుగోలు చేస్తే, ఆ అవకాశం లేని వారు యూజ్డ్ కార్లు సొంతం చేసుకుంటున్నారు. 2024 యూజ్డ్ కార్ల విక్రయాల్లో మారుతి సుజుకి స్విఫ్ట్ మొదటి స్థానంలో నిలిచింది. దేశంలోని మెట్రో పాలిటన్ నగరాలు, నాన్ మెట్రో నగరాల పరిధిలో అత్యధికంగా 'స్విఫ్ట్ కారుకు డిమాండ్ ఎక్కువగా ఉందని కార్స్24ఎస్ 'గేర్ ఆఫ్ గ్రోత్: 2024 ఇండియన్ యూజ్డ్ కార్ల మార్కెట్ నివేదిక'పేర్కొంది.మారుతి సుజుకి స్విఫ్ట్ తర్వాత హ్యుండాయ్ శాంట్రో , టాటా టియాగో ఎన్‌ఆర్‌జీ , మారుతి సుజుకి వ్యాగన్-ఆర్ తదితర యూజ్డ్ కార్లకు గిరాకీ బాగానే ఉంది. 2023లో 46 లక్షల యూనిట్లు అమ్ముడైన యూజ్డ్ కార్ల మార్కెట్ 2030కల్లా 10.8 మిలియన్ యూనిట్లకు చేరుతుంది. యూజ్డ్ కార్ల మార్కెట్‌లో 2024లో మహారాష్ట్ర, కర్ణాటక, ఢిల్లీ టాప్‌లో నిలిచాయి. 2023తో పోలిస్తే గతేడాది కార్ల సేల్స్ ఐదు రెట్లు పెరిగాయి. 2023లో మాదిరిగానే 2024లోనూ యూజ్డ్ ఎస్‌యూవీ కార్లు గణనీయంగానే అమ్ముడయ్యాయి. గతేడాది మొత్తం యూజ్డ్ కార్ల విక్రయంలో ఎస్‌యూవీల వాటా 16.7 శాతంగా ఉంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోనూ యూజ్డ్ ఎస్‌యూవీ కార్లు ఫేవరెట్లుగానే ఉన్నాయి. యూజ్డ్ కార్ల విక్రయాల్లో మహారాష్ట్ర 16.4శాతం, ఉత్తరప్రదేశ్ 11.7శాతం, ఢిల్లీ 13.8 శాతం వాటా కలిగి ఉన్నాయి.

# స్పోర్ట్స్

## రెండో టీ20లో ఇంగ్లండ్‌పై భారత్ విజయం



చెన్నై వేదికగా ఇంగ్లాండ్‌తో ఉత్కంఠ భరితంగా సాగిన రెండో టీ20 మ్యాచ్‌లో భారత్ విజయం సాధించింది. 2 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌పై భారత్ గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ స్కోర్ 165/9 కాగా, భారత్ స్కోర్ 166/8. ఐదు టీ20ల సిరీస్‌లో 2-0 భారత్ ఆధిక్యం. తిలక్ వర్మ 55 బంతుల్లో 72 పరుగులు చేశారు. ఇక ఇంగ్లండ్ బ్యాటింగ్‌లో బట్లర్ 45, కార్సే 31 పరుగులు చేశారు. చెన్నైలోని చెపాక్ స్టేడియంలో శనివారం జరుగుతోన్న మ్యాచ్‌లో భారత్ విజయం సాధించింది. ఈ టార్గెట్‌ను భారత్.. 8 వికెట్లు కోల్పోయి 19.2 ఓవర్లలో ఛేదించింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్ కోసం రంగంలోకి దిగిన ఇంగ్లాండ్‌కు అర్షదీప్ సింగ్ షాక్ ఇచ్చాడు. తొలి ఓవర్‌లోనే ఫిలిప్ సాల్ట్‌ను ఔట్ చేశాడు. మరో ఓపెనర్ బెన్ డకెటన్ కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలబడలేకపోయాడు. ఈ దశలో కెప్టెన్ జోస్ బట్లర్ (45) నిలబడ్డాడు. ఇతర బ్యాటర్ల సాయంతో స్కోరు బోర్డును 150 పరుగుల మార్కును దాటించాడు.

## ముంబైకి ఊహించని పరాజయం

**-జమ్మూ కశ్మీర్‌తో తలపడ్డ ముంబై**
**-ముంబై 5 వికెట్ల తేడాతో ఓటమి**



ప్రతిష్టాత్మక రంజీ ట్రోఫీ 2024-25లో ముంబైకి ఊహించని పరాజయం ఎదురైంది. జమ్మూ కశ్మీర్‌తో శనివారం ముగిసిన మ్యాచ్‌లో ముంబై 5 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఈ సీజన్‌లో ముంబైకి ఇది రెండో పరాజయం. వరుస విజయాలతో జోరు మీదున్న ముంబైకి టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ రీఎంట్రీ నష్టం చేసింది. అతనితో పాటు స్టార్ ఓపెనర్ యశస్వి జైస్వాల్ కూడా బరిలోకి దిగడంతో ఫామ్‌లో ఉన్న 17 ఏళ్ల దేశవాళీ క్రికెటర్ ఆయుష్‌ను పక్కనపెట్టారు. ఈ మ్యాచ్‌లో రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్ దారుణంగా విఫలమయ్యారు. 205 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జమ్మూ కశ్మీర్ 49 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 207 పరుగులు చేసి గెలుపొందింది.' అంతకుముందు 274/7 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను కొనసాగించిన ముంబై 290 పరుగులకు ఆలౌటైంది. శార్దూల్ ఠాకూర్(135 బంతుల్లో 18 ఫోర్లతో 119) సెంచరీతో రాణించగా.. తనూష్ కోటియన్(136 బంతుల్లో 6 ఫోర్లతో 62) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. కానీ జమ్మూ కశ్మీర్ బ్యాటర్లు సమష్టిగా రాణించి సంచలన విజయాన్ని అందుకున్నారు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ముంబై 120 పరుగులకే కుప్పకూలింది. అనంతరం జమ్మూ కశ్మీర్ 206 పరుగులు చేసి 86 పరుగుల భారీ ఆధిక్యాన్ని సొంతం చేసుకుంది. ఈ ఆధిక్యం ఆ జట్టుకు కలిసొచ్చింది. గ్రూప్‌లో ఇప్పటి వరకు 6 మ్యాచ్‌లు ఆడిన ముంబై 3 మ్యాచ్‌లు గెలిచి మరో రెండింటిలో ఓటమిపాలైంది. ఓ మ్యాచ్ డ్రా అయ్యింది. ఈ గ్రూప్‌లో జమ్మూ కశ్మీర్ అగ్రస్థానంలో కొనసాగుతోంది.

## ఐసీసి 2024 టీ20 టీమ్ ఆఫ్ ది ఇయర్ ప్రకటన

**-11 మంది ఆటగాళ్లతో జట్టు జాబితా విడుదల**
**-సారథిగా రోహిత్ శర్మ ఎంపిక**




2024 టీ20 టీమ్ ఆఫ్ ది ఇయర్?ను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ శనివారం ప్రకటించింది. గతేడాది టీ20 ఫార్మాట్?లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన 11 మంది ఆటగాళ్లతో జట్టును విడుదల చేసింది. ఈ జట్టుకు వరల్డ్?కప్ విన్నింగ్ కెప్టెన్ రోహిత్ శర్మనే సారథిగా ఎంపికయ్యాడు. రోహిత్ సహా ఈ జట్టులో నలుగురు టీమ్‌ఇండియా ప్లేయర్లకు చోటు దక్కింది. హార్దిక్ పాండ్య, జస్ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్? ఉన్నారు. అయితే ఈ జట్టులో అత్యధికంగా భారత్ నుంచి నలుగురు ఆటగాళ్లు ఉండడం విశేషం. మిగతా ఏ జట్టు నుంచి కూడా ఇద్దరు ఈ జట్టులో చోటు దక్కించుకోలేదు. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, పాకిస్థాన్, వెస్టిండీస్, జింబాబ్వే, శ్రీలంక, అఫ్ఘానిస్థాన్? దేశాల నుంచి ఒక్కొక్కరు ఎంపికయ్యారు. గతేడాది పొట్టి ఫార్మాట్? క్రికెట్?లో రోహిత్ శర్మ అత్యుత్తమంగా రాణించాడు. 11 మ్యాచ్?ల్లో 378 పరుగులు చేశాడు. అందులో ఓ సెంచరీ ఉంది. ఇక టీ20 వరల్డ్?కప్?లోనూ హిట్?మ్యాన్ అద్భుతంగా ఆడాడు. సూపర్ 8లో ఆస్ట్రేలియాపై 92 పరుగులతో రఫ్ఫాడించాడు. అలాగే టీమ్‌ఇండియా విశ్వవిజేతగా నిలవడంలోనూ కీలక పాత్ర పోషించాడు.

**జట్టు :**
రోహిత్ శర్మ (కెప్టెన్), ట్రావిస్ హెడ్, ఫిల్ సాల్ట్, బాబర్ అజామ్, నికోలస్ పూరన్, సికిందర్ రజా, హార్దిక్ పాండ్య, రషీద్ ఖాన్, వానిందు హసరంగ, జస్ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్

# రాజమౌళి ప్రాజెక్టు షురూ

టాలీవుడ్ దర్శక దిగ్గజం ఎస్.ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబోలో ఒక సినిమా రానున్న విషయం తెలిసిందే. అంటూ వస్తున్న ఈ ప్రాజెక్ట్ ఎప్పుడు పట్టాలెక్కుతుందా అని అటు బాబు ఫ్యాన్స్‌తో పాటు మూవీ లవర్స్ తెగ ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పూజ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం ప్రీ ప్రోడక్షన్ పనులు జరుపుకుంటుంది. ఈ నేపథ్యంలో మూవీ నుంచి సాలిడ్ అప్‌డేట్‌ను పంచుకున్నారు దర్శకుడు రాజమౌళి. ఈ మూవీ షూటింగ్ స్టార్ట్ అయినట్లు చెబుతూ.. ఒక వీడియోను విడుదల చేశాడు రాజమౌళి. ఈ వీడియోలో సింహాన్ని (మహేశ్ బాబుని) ఎటు వెళ్లకుండా బోన్‌లో లాక్ చేసినట్లు పాస్‌పోర్ట్ చూపిస్తున్న వీడియో విడుదల చేశారు. దీనికి 'క్యాప్చర్' అనే క్యాప్షన్ పెట్టారు. అయితే ఈ వీడియోతో తాజాగా ఈ మూవీ పట్టాలెక్కబోతున్నట్లు తెలుస్తుంది. అయితే ఈ సినిమాలో ప్రియాంక చోప్రా కథానాయికగా ఫిక్స్ అయినట్లు తన పోస్ట్‌తో ఖరారు చేసింది. మరోవైపు ఈ వీడియోపై మహేశ్ బాబు, ప్రియాంక చోప్రా స్పందించారు. మహేశ్ బాబు స్పందిస్తూ.. ఒక్కసారి కమిట్ అయితే నా మాట నేనే వినను పోకిరిలోని డైలాగ్‌ను కామెంట్ చేశారు. ప్రియాంకచోప్రా స్పందిస్తూ.. ఫైనల్లీ అంటూ రాసుకోచ్చింది. అడ్వెంచర్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమా అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే కథతో వస్తుంది.




# రాజాసాబ్‌లో నా పాత్రను ఊహించలేరు

నిధి అగర్వాల్.. ప్రస్తుతం రెండు బడా సినిమాల్లో హీరోయిన్‌గా చేస్తుంది. ఈ అమ్మడు ఇప్పటివరకు చేసిన సినిమాల్లో ఒకే ఒక్క హిట్ అందుకుంది. సవ్యసాచి సినిమాతో హీరోయిన్ గా టాలీవుడ్ కు పరిచయం అయ్యింది. కానీ ఈ సినిమా డిజాస్టర్ అయ్యింది. ఆతర్వాత మరోసారి అక్కినేని హీరో అఖిల్ తో జతకట్టింది. అఖిల్ హీరోగా నటించిన మిస్టర్ మజ్ను సినిమాలో హీరోయిన్ గా చేసింది కానీ ఈ సినిమా కూడా దారుణంగా నిరాశపరిచింది. ఈ సినిమా ఫ్లాప్ అవ్వడంతో అమ్మడి కెరీర్ కష్టమే అని అనుకున్నారు కొందరు. కానీ అదే టైం లో గ్లామర్ గేట్లు ఎత్తేసింది ఈ భామ. పూరిజగన్నాథ్ డైరెక్షన్ లో వచ్చిన ఇస్మార్ట్ శంకర్ సినిమాతో భారీ హిట్ అందుకుంది. ఈ సినిమాలో నటనతో పాటు తన అందంతోనూ ప్రేక్షకులను కవ్వించింది ఈ వయ్యారి. ఆతర్వాత తిరిగి ఫ్లాప్స్ పలకరించాయి. వరుస ఫ్లాప్స్ తో సతమతం అవుతున్న ఈ అమ్మడు ఇప్పుడు రెండు బడా సినిమాలను లైనప్ చేసింది. వాటిలో ఒకటి ప్రభాస్ హీరోగా నటిస్తున్న రాజా సాబ్, మరొకటి హరిహరవీరమల్లు. తాజాగా నిధి ప్రభాస్ సినిమా గురించి మాట్లాడుతూ.. ప్రేక్షకులు ఎక్కువగా నా నుంచి గ్లామర్ పాత్రలు ఆశిస్తారు. నేను కూడా అలాంటి పాత్రలే ఎక్కువగా చేస్తానని భావిస్తారు. రాజాసాబ్‌తో ప్రజలు నాపై ఉన్న ఈ అభిప్రాయాన్ని మార్చుకుంటారని చెప్పుకొచ్చింది. రాజాసాబ్ సినిమాలో నా పాత్ర అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తుంది. ఇందులో నా పాత్రను ప్రేక్షకులు ఊహించలేరు అని చెప్పుకొచ్చింది నిధి అగర్వాల్.



# నాగ చైతన్య 'తండేల్' ట్రైలర్ వచ్చేది అప్పుడే.!

టాలీవుడ్ నటుడు అక్కినేని నాగ చైతన్య ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం తండేల్ మలయాళీ బ్యూటీ సాయి పల్లవి కథనాయికగా నటిస్తుండగా.. చందు మొండేటి దర్శకత్వం వహిస్తున్నాడు. గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై అల్లు అరవింద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఫిబ్రవరి 07న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా వరుస ప్రమోషన్స్ నిర్వహిస్తుంది చిత్రబృందం. తాజాగా తండేల్ ట్రైలర్ అప్‌డేట్‌ను ఇచ్చారు మేకర్స్. ఈ సినిమా ట్రైలర్‌ను జనవరి 28న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. ఈ సినిమా విషయానికి వస్తే.. బతుకుదెరువు కోసం గుజరాత్‌లోని వీరవల్‌కు వెళ్లిన నాగ చైతన్య సముద్రవేట చేస్తూ పాకిస్థాన్ కోస్టుగార్డులకు చిక్కుతాడు. అయితే పాకిస్థాన్ జైలు నుంచి అతడు ఎలా బయటపడ్డాడు అనే స్టోరీతో ఈ సినిమా రానుంది. ఇక ఇందులోనే కొంచెం ప్రేమ కథ, దేశభక్తి అంశాలు జోడించి కమర్షియల్ గా తెరకెక్కిస్తున్నారు మేకర్స్.




# సమంత మళ్లీ సినిమాలు చేయడానికి కారణం ఆ హీరోనేనా?

టాలీవుడ్ సీనియర్ స్టార్ హీరోయిన్ సమంత. మొదటి సినిమాతోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది ఈ బ్యూటీ. ఇక ఈ అమ్మడు అందానికి, నటనకు అందరూ ఫిదా అయిపోయారు. దీంతో సామ్‌కు వరసగా ఆఫర్స్ క్యూ కట్టాయి. దీంతో వచ్చిన ప్రతి అవకాశాన్ని మిస్ చేసుకోకుండా, సమంత ప్రతి సినిమా చేసింది. ఇక సామ్ చేసిన ప్రతి సినిమా బ్లాక్ బస్టర్ అవుతూ వచ్చాయి. దీంతో ఈ అమ్మడు టాలీవుడ్ లక్కీ హీరోయిన్‌గా మారిపోయింది. ఇక సమంత చేసిన సినిమాల్లో ఫ్లాప్స్ కంటే హిట్ మూవీసే ఎక్కువగా ఉంటాయి. క కెరీర్ మంచి ఫామ్‌లో ఉన్న సమయంలోనే అక్కినేని నాగచైతన్యతో వివాహం, తర్వాత విడాకులు, మయోసైటీస్ ఇవన్నీ సమంత సినీ కెరీర్‌పై చాలా ప్రభావం చూపాయి. అటు మానసిక వేధన, ఇటు మయోసైటీస్ వ్యాధితో కొన్ని రోజుల పాటు పోరాడింది సమంత. ఈ క్రమంలోనే తాను సినిమాలకు బ్రేక్ ఇస్తున్నాను, అనారోగ్యం కారణంగా కొన్ని రోజుల పాటు సినిమాలకు దూరంగా ఉండాలనుకుంటున్నానంటూ ప్రకటించి, చాలా రోజులు సినిమాలకు దూరంగా ఉంది. అయితే ఆ తర్వాత మళ్లీ ఇండస్ట్రీలోకి రీ ఎంట్రి ఇచ్చింది ఈ బ్యూటీ. ఖుషి, హాలో బన్నీ వెబ్ సిరీస్ ఇలా పలు సినిమాల్లో నటించింది. ఇప్పుడు మా ఇంటి బంగారంతో అభిమానులను పలకరించడానికి రెడీ అయ్యింది. అయితే సమంత సినిమాల్లోకి రావడానికి ఆ హీరోనే కారణం అంటూ ఓ వార్త వైరల్ అవుతోంది. అతను ఎవరో కాదు, సింగర్ చిన్మయ్ భర్త, సమంత క్లోజ్ ఫ్రెండ్ రాహుల్ రవీంద్రన్, ఈయన వల్లనే సామ్ మళ్లీ సినిమాల్లోకి రీ ఎంట్రీ ఇచ్చిందంట. అయితే ఈ విషయాన్ని సమంతో గతంలో ఓ ఇంటర్వ్యూలో తెలిపింది. కాగా, మరోసారి ఈ కామెంట్స్ వైరల్‌గా మారాయి.



# బాలయ్య సరసన సంయుక్త



నందమూరి బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న భారీ ప్రతిష్ఠాత్మక చిత్రం 'అఖండ 2.. తాండవం'. ఈ సినిమాలో కథానాయికగా సంయుక్త మీనన్‌ను ఎంపిక చేసినట్లు నిర్మాతలు రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట చెప్పారు. హీరోయిన్లను అద్భుతమైన పాత్రల్లో చూపించే బోయపాటి శ్రీను సంయుక్త కోసం ఓ కీలక పాత్ర సిద్ధం చేశారు. భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకొనే ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం జరుగుతోంది. ఈ సినిమాకు ఎస్. థమన్ సంగీత దర్శకుడు. సి.రామ్‌ప్రసాద్ ఛాయాగ్రాహకుడు. ఈ ఏడాది సెప్టెంబర్ 25న విజయదశమి సందర్భంగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492